## అధ్యాయము 1

# సంఘములో ఏర్పడిన విభజనలు మరియు తలెత్తిన కలహములు

గ్రీకులు-రోమీయులు ఏలుచుండిన ప్రపంచంలో ప్రజలు ఉత్తరములు వ్రాసుకొనినప్పుడు, వారు తమ్మును తాము ప్రారంభ పలుకుల్లోనే గుర్తించుకొన్నారు. ఇంతేగాక, వ్రాయబడుతున్న తమ ఉత్తరములు సాధించాల్సిన బృహత్కార్యానికి వారు తద్వారా పునాది వేసుకొన్నారు. కొన్ని ప్రధానాంశాలను పరిచయం చేయడం ద్వారా, ఒక ప్రక్క తన పాఠకుల పట్ల గల అధికారపూర్వకమైన తన దృష్టికోణాన్ని ధ్రువీకరిస్తూ మరొక ప్రక్క వారి విషయంలో ఆయన కలిగియున్న అనురాగసహితమైన ఆందోళనను వ్యక్తం చేస్తూ పౌలు తన పత్రికను కొరింథీయులకు వ్రాయడం మొదలుపెట్టాడు. సంఘ సమాజంలో వారు ఒకరితో మరొకరు చేపట్టుచుండిన అన్యోన్య చర్యల ద్వారా రూపొందించుకొనబడుచుండిన దేవునితో గల సంబంధం, తదనంతరపు విషయాలై యుండినది.

కొద్ది సంవత్సరముల క్రితమైతే, పౌలు పాఠకులు యేసు క్రీస్తు గూర్చి ఎన్నడైనను వినలేదు; గనుక "దేవుని సంఘము" అనేది వారికి అర్థంలేని పదజాలమై యుండేది. ఇప్పుడైతే, ఆటంకములను క్రైస్తవులు జయించునట్లు అపొస్తలుడు గతంలో సంఘంతో అతడు గడించిన అనుభవముల ఆధారంగా వారికి సహాయం చేయగలవాడై యుండెను. క్రీస్తునకు చెందియున్నంత మాత్రాన పాపము యొక్క ప్రలోభాల నుండి స్వాతంత్ర్యం లభించలేదని వారు తెలుసుకొన్నారు. కొరింథు పట్టణంలోని క్రైస్తవులు ఎదుర్కొనుచుండిన కొన్ని ఆటంకాలు, విశ్వాసులు ఒకరికొకరు తోడ్పడవలసిన విధంగా తోడ్పడకుండుట వలన ఏర్పడిన పరిణామమై యుండింది. శత్రుభావము కలిగియుండిన దేవుడులేని లోకము నుండి ఎదురగుచుండిన ఒత్తిడుల ఫలితంగా సంఘంలో ఇతర సంక్షోభములు ఏర్పడినవి.

### పౌలు మరియు సొస్తెనేసు తెలుపుతున్న అభివందన పలుకులు (1:1-3)

**1 దేవుని చిత్తమువలన యేసుక్రీస్తు యొక్క అపొస్తలుడుగా నుండుటకు పిలువబడిన పౌలును, సహోదరుడైన సొస్తెనేసును 2 కొరింథులో నున్న దేవుని సంఘమునకు, అనగా క్రీస్తుయేసు నందు పరిశుద్ధపరచబడినవారై పరిశుద్ధులుగ ఉండుటకు**

**పిలువబడినవారికిని, వారికిని మనకును ప్రభువుగా ఉన్న మన ప్రభువైన యేసు క్రీస్తు నామమున ప్రతి స్థలములో ప్రార్థించువారికందరికిని శుభమని చెప్పి వ్రాయునది. [3]మన తండ్రియైన దేవుని నుండియు, ప్రభువైన యేసుక్రీస్తు నుండియు కృపాసమాధానములు మీకు కలుగునుగాక.**

**వచనము 1. పౌలు** దాదాపుగా తన పత్రికలన్నిటిని అతడు **అపొస్తలుడుగా నుండుటకు పిలువబడిన**వాడని తనను తాను గుర్తించుకొంటూ మొదలుపెట్టాడు. ఫిలిప్పీయులకు వ్రాయబడిన పత్రిక, థెస్సలొనీకయులకు వ్రాయబడిన రెండు పత్రికలు, మరియు ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రిక ఈ విషయంలో మినహాయింపబడినవి. స్నేహితులకు వ్రాయబడిన ఉత్తరములలో అపొస్తలిక అధికారము విషయమైన విధ్యుక్త ధ్రువీకరణము ఆశింపబడలేదు; ఒక వేళ ఆశింపబడినట్లయితే, అది వారి మనస్సును బాధపరచవచ్చు. ప్రస్తుత ప్రపంచంలో, ఒక ఎమ్.డి. పట్టము లేదా ఒక పిహెచ్.డి. పట్టము కలిగియుండు వ్యక్తి సంఘ సభ్యులందరిని కలుసుకొనునప్పుడు - అతని కంటె చిన్న వయస్కులతో సహితం -అతని పేరు పెట్టి పిలువబడవచ్చు. స్నేహితులు ఒకరితో నొకరు ముచ్చటించుకొనునప్పుడు వారి వారి బిరుదులు ఉపయోగించరు. “అపొస్తలుడను” అని తనను తాను గుర్తించుకొనడం ద్వారా, పౌలు తనకును తన పాఠకులకును మధ్య కొంత ఎడము ఏర్పరచుకొన్నాడు. అతడు వారి స్నేహితుడై యుండెను; కాని, ఒక మంచి తండ్రి వలె, అతడు స్నేహితుని మించినవాడై యుండెను. పౌలు దేవుని చేత నియమితు డయ్యాడు. స్నేహము సంగతెలావున్నా, అతడు **యేసు క్రీస్తు** యొక్క **అపొస్తలుడై** యుండెననే విషయాన్ని అతడు గాని వారు గాని మర్చిపోకూడదు.

పౌలు తన అపొస్తలత్వము గూర్చి కొరింథీయులకు వ్రాసిన తన మొదటి పత్రికలో తనను తాను సమర్థించుకొనుచుండినట్లు కనబడలేదు; పౌలు ఆత్మసంబంధమైన నాయకత్వమును చేపట్టునని అతడు మరియు అతని పాఠకులు ఆశించారు. కొరింథీ సంఘము యొక్క అవసరముల గూర్చి మాటలాడుటకు అపొస్తలత్వము వేదికయై యుండింది,[1] అయితే అతడు లోకమునకు క్రీస్తు సందేశము నందించుటకు అది అతనిని బలవంతము చేయుచుండిన శక్తి కూడ అయియుండింది. అతడు అపొస్తలుడై యుండినట్లు ప్రకటించిన సంకేతములలో, పౌలు ప్రభువును చూచుట గూర్చి విన్నవించుకొన్నాడు (9:1; 15:8); కాని అతని స్వాధికార అపేక్ష అంతకు మించిన విషయం చేత బలపరచబడింది. ఇట్టి పదవికి అతడు దేవుని పిలుపునుబట్టియే నియమితుడయ్యాడు (గలతీ. 1:15) మరియు అతడు కలిగియుండిన పరిశుద్ధాత్మ ద్వారా ధ్రువీకరింపబడింది (1 కొరింథీ. 7:40; గలతీ. 3:2). ముఖ్యంగా కొరింథీయులకు, పౌలు యొక్క అపొస్తలత్వము విదితమై యుండింది. వారిని క్రీస్తు నొద్దకు నడిపించింది పౌలే, మరియు వారికి పరిశుద్ధాత్మ ప్రదానము చేయబడునట్లు ప్రార్థించినది కూడ అతడే (2 కొరింథీ. 3:2, 3).

అతని అపొస్తలత్వము అనివార్యంచేయు బాధ్యతను అంగీకరించడానికి అతడు సంసిద్ధుడై యుండెనని పౌలు రచించిన పరిచయ వాక్కులు తన పాఠకులకు

తెలియజెప్పాయి. నాయత్వము వహించుట వలన అందరి దృష్టికి అనిష్టుడై యుండుట అతడు చెల్లించాల్సిన మూల్యమైనట్లయితే, అందుకు కూడ అతడు సిద్ధంగా ఉండెను. భక్తిహీనమైన ప్రవర్తన లేదా క్రైస్తవ ఒప్పుకోలుతో రాజీ పడు ఏ విషయంలోనైనను అతడు ప్రభువు పక్షం వహించిన దృక్పథముగలవాడై యుండవచ్చునని వారాశించవచ్చు. పౌలు వ్రాయబోవుచుండిన పత్రిక ఆషామాషీగా లేదా స్నేహపూర్వకంగా వ్రాయబడిన దానిని మించినదై యుండబోవుచున్నది. పౌలు తన జతపనివారైన తిమోతి మరియు తీతుకు వ్రాసినప్పుడు కూడ, తనను తాను "అపొస్తలుడు"గా గుర్తించుకొన్నాడు. ఈ ఉత్తరములను పౌలు తన వ్యక్తిగత స్నేహితులకే వ్రాసినప్పటికిని, అతని ఆదేశములు మరియ మందలింపులు ఈ సువార్తీకులకు బహిరంగ కార్యక్షేత్రాల్లో మార్గదర్శకములై యుంటాయని పౌలు ఆశించాడు.

అభివందన పలుకులను తెలియజెప్పుటలో **సొస్తెనేసు** పౌలుతో కూడ చేరుతున్నాడు. రోమీయులకు, గలతీయులకు, ఎఫెసీయులకు, తిమోతికి మరియు తీతుకు వ్రాయబడిన పత్రికలలో, సహోదరులందరికి పౌలు మాత్రమే తన అభివందన పలుకులను తెలియజేశాడు. కొరింథీయులకు వ్రాయబడిన రెండవ పత్రిక, ఫిలిప్పీయులకు, కొలస్సయులకు, మరియు ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికల ద్వారా తెలియజెప్పబడిన అభివందన పలుకుల్లో పౌలు పేరుతో పాటు తిమోతి పేరు కూడ ఉంటుంది. థెస్సలొనీకయులకు వ్రాయబడిన రెండు పత్రికల్లోను, పౌలుతో కూడ సీల మరియు తిమోతి ఉండినట్టు తెలుస్తున్నది. కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలో మాత్రమే పౌలుతో కూడ సొస్తెనేసు చేరాడు.

గ్రీకు ప్రజల్లో సహితం, "సొస్తెనేసు" అనేది కొంత మేరకు అరుదైన నామమై యుండెను. ఈ పేరు క్రొత్త నిబంధనలో ఇక్కడ మరియు అపొ. 18:17లోమాత్రమే కనబడుతుంది. గనుక ఒక ప్రశ్నవెంటనే తలెత్తుతుంది: కొరింథీయులకు తన అభివందన పలుకులు తెలియజేసిన సొస్తెనేసు మరియు అపొ. 18:17 ప్రకారం కొరింథులో గల్లియో న్యాయపీఠము యెదుట కొట్టబడిన "సమాజమందిరపు అధికారియైన ['ప్రధాన అధికారి'; KJV] సొస్తెనేసు" ఒకడేనా? ఒకడే అయినట్లయితే, కొరింథీయులకు వ్రాయబడిన పత్రికలో పేర్కొనబడిన సొస్తెనేసు, ఎఫెస్సులో ఏంచేస్తున్నట్టు? అతడు కొరింథు నుండి ఎఫెస్సులో ఉండిన పౌలు యొద్దకు సంఘంలో తలెత్తిన ప్రశ్నలు తీసుకొని ఒక రాయబారిగా రాలేదని స్పష్టమవుతున్నది. కనీసం, కొరింథు నుండి ఒక ఉత్తరమిచ్చి పంపబడినవారితో కూడ ఇతని పేరు పేర్కొనబడలేదు (1 కొరింథీ. 16:17). ఇంకా, ఇంతకు మించి ఈ పత్రికలో యింకా ఏమియు పేర్కొనబడలేదు. బహుశా, ఇతడు అదే సొస్తెనేసు కాదేమో; కాని ఎఫెస్సులో నున్న క్రైస్తవులందరిలో, సొస్తెనేసు ఒక్కడే ఈ అభివందన పలుకుల్లో పౌలుతో చేరాడని మనము ప్రశ్న వేసుకొనవలసి యుంటుంది.

మనకు తెలియని కారణాలనుబట్టి, కొరింథుకు సంబంధించిన సొస్తెనేసు (అపొ. 18:17) ఎఫెస్సు పట్టణానికి వలస వచ్చియుంటాడని అనుకొందాము. ఇతడు కొరింథులోని యూదు సమాజంలో ప్రముఖమైన వాడై యుండెనని అర్థమవుతున్నది. క్రిస్పు, మాజీ సమాజమందిరపు అధికారి, క్రీస్తే యేసైయున్నాడని ఒప్పుకొనినప్పుడు,

యూదులు నాయకుడు లేనివారయ్యారు (అపో. 18:8). గనుక సొస్తెనేసు ముందుకు వచ్చాడు. రోమీయుల ప్రత్యేక ధర్మాసనం యెదుట యూదులు క్రైస్తవులతో పూర్తిగా తెగదెంపులు చేసుకొనడం మంచిదని ప్రతిపాదించినది బహుశా ఇతడే అయియుండవచ్చు. అధికారులు, క్రైస్తవులను యూదులుగా కాదు, గాని ప్రపంచాన్నే పురికొల్పుతున్న అల్లరి జనముగా దృష్టించాలనియు, గనుక వారికి రోమీయుల చట్ట ప్రకారం యూదులకు సమకూర్చబడు ఏ విధమైన హోదా లేదా కాపుదల ఇవ్వబడకూడదనియు కోరాడు. అతని దృష్టిలో క్రైస్తవులు, యూదులు మరియు గ్రీకులు "ధర్మశాస్త్రమునకు వ్యతిరిక్తముగా దేవుని ఆరాధించుటకు జనులను ప్రేరేపించుచున్నవారై" యుండిరి (అపో. 18:13). సొస్తెనేసు, ప్రాథమికంగా, "యూదులమైన మేము క్రైస్తవులను అంగీకరించము. వారికిని మాకును ఏ సంబంధం లేదు. వారు మాకు చెందినవారు ఏమాత్రమును కాదు. రోమీయులైన మీరు పరదేశపు మతమునకు సంబంధించిన వారితో వ్యవహరించు రీతినే, వారితో కూడ మీకిష్టము వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారని" ప్రకటించాడు.

గల్లియో యెదుట కొనసాగిన తీర్పు సొస్తెనేసు అనుకొన్నట్టు పరిణమించలేదు. అపొస్తలుల కార్యముల పుస్తకం పూర్తిగా వివరించని కారణాలనుబట్టి, ధర్మాసనం తీర్పు తీర్చుచుండగా న్యాయస్థానంలో సమావేశమై యుండినవారు సమాజమందిరపు అధికారిని పట్టుకొని కొట్టారు, గట్టిగానే కొట్టినట్టున్నారు! సమాజమందిరపు అధికారి అనాసక్తిపరుడైన సామంత రాజు సమక్షంలోనే కొట్టబడ్డాడు. ఈ విషయంలో గల్లియో తీసికొనిన నిర్ణయమునుబట్టియే కాబోలు, మున్ముందటి కొన్ని సంవత్సరముల వరకు, యూదులను మరియు క్రైస్తవులను కూడ దేవుని ఆరాధించు ప్రజలుగా వర్గీకరించనై యుండిన రోమీయుల మధ్య దీని చట్టపరమైన ఆధికత్యతకు అతడు దోహదపడ్డాడు. ఏదేమైనప్పటికిని, "అయితే గల్లియోను వీటిలో ఏ సంగతిని గూర్చియు లక్ష్యపెట్టలేదని" అపో. 18:17బి తెలియజెప్పుతున్నది.

అతని విధికృతమునుబట్టి గల్లియో యెదుట దెబ్బలు తినిన తరువాత, కొరింథులో అతని పట్ల దయతలచేవారే లేరని సొస్తెనేసు అనుకొని యుంటాడు. ఈ హేతువునుబట్టియే కాబోలు అతడు ఎఫెస్సునకు వెళ్లిపోయాడు. ఎఫెస్సులో అతడు తన సొంత చొరవనుబట్టియే కాబోలు, అతడు పౌలును మరొక పర్యాయం కలుసుకొన్నాడు. అపొస్తలుడు చెప్పిన విషయాలను విని, క్రీస్తు అడుగుజాడల్లో నడుచుకొన్నాడు. సొస్తెనేసు క్రీస్తును ప్రభువుగా అంగీకరించి, వరుసగా క్రీస్తు మరియు క్రైస్తవ సందేశమునందు విశ్వాసముంచిన కొరింథు సమాజమందిరపు రెండవ అధికారి అయ్యాడు.

తన అభివందన వచనములను తెలియజేయుటలో సొస్తెనేసు పౌలుతో చేరాడు, కాని కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రిక యొక్క రచనలో అతడు ఎవ్విధంగాను పాలుపంచుకొనలేదని స్పష్టమవుతున్నది. వారి పేర్లు కలిసియున్నట్టు కనబడుచుండినదనే వాస్తవము, కొరింథులోని క్రైస్తవులు విజయోత్సవంతో కొనసాగుచున్న మహోద్యమములోని ఉద్యమనాయకుని దళములో ఉండిరనుటకు ఒక సంకేతమై యుండింది (రోమా. 1:8-10; కొలొస్స. 1:6; 1 పేతురు 5:9 చూడుము).

దేవుని సంకల్పములను ఏ విరోధియైనను ఎదిరించలేకపోయాడు. ఆయన సంకల్పములు అనివార్యంగా సాధింపబడుతాయి. కొరింథీయులు వారి పూర్వ శత్రువైనవాని యొద్ద నుండి అభివందన వచనములు ఆశించియుండకపోవచ్చు గనుక సొస్తేనేసు పేరు ప్రక్కలో పౌలు మన **సహోదరుడు** అని చేర్చియుంటాడు. సొస్తేనేసు క్రీస్తునంగీకరించుట వారికి ఆశ్చర్యజనకమైన ఆహ్లాదమై యుండవచ్చు.

**వచనము 2.** పౌలు ఈ ఉత్తరమును **కొరింథులోనున్న దేవుని సంఘమునకు** వ్రాస్తున్నాడు. "సంఘము" అనే పదము LXXలో నుండి అవలంబింపబడింది.[2] ప్రాపంచిక ప్రపంచంలో, ఇది రాష్ట్రమునకు సంబంధించిన విషయాలను పౌరులు నిర్ణయించుచుండిన పట్టణ శాసనసభ సందర్భంలో వాడబడిన సాధారణ పదమై యుండింది (అపో. 19:39 చూడుము). ఈ పదమును శాసన సభకు సంబంధించిన అభిప్రాయము నుండి వేరుచేయడానికి గ్రీకు పాఠకులు కష్టపడియుండవచ్చు. "సంఘము" అను పదమును పౌలు విశ్వాసుల విషయంలో ప్రయోగించినప్పుడు, క్రైస్తవులు సమావేశమగుచుండిరనే అవగాహనతో ఉపయోగించాడు. సంఘము ఇతరత్రా ఏమై యుండినను లేదా ఏ ఇతర పనులను చేసినను, అది సమావేశమగుచుండినది. క్రైస్తవులు దేవుని సన్నిధానమందు సమావేశమగుచు ఆయన స్తుతులనర్పించుచుండిరి. వారు సమష్టి విశ్వాసపుటప్పుకోలులో ఒకరికొకరు తోడ్పాటును అందజేసుకొనుటకును, ఒకరినొకరు బలపర్చుకొనుచు ప్రోత్సహించు కొనుటకును, సమష్టి జీవిత విధానమును అవలంబించు టకును కూడుకొనుచుండిరి (హెబ్రీ. 10:23-25).

తన పాఠకుల విశ్వాసపుటప్పుకోలు మరియు వారి ప్రవర్తన వారు తమ్మును గూర్చి తాము కలిగియుండు అభిప్రాయముపై ఆధారపడుచు అదుపుచేయబడుతుందనే విషయం అపొస్తలుడు ఎరిగియుండెను. వారు "దేవుని సంఘమై" యుండిరి; వారు, పౌలు వలెనే, **క్రీస్తు యేసు నందు పరిశుద్ధపరచబడినవారై** యుండిరి. వారు ఆయన నామమును ధరించుటకు ఒక ప్రజయై యుండునట్లు ఆయన వారిని పిలిచాడు కాబట్టి వారు పరిశుద్ధపరచబడ్డారు. "పరిశుద్ధపరచబడుట అనగా సాధింపబడిన ఏదైన ఒక నిర్దిష్టమైన నైతిక లక్షణము కాదు గాని దేవునితో కలిగియుండుటకు ప్రదానము చేయబడిన ఒక నిర్దిష్టమైన సంబంధమై యున్నది."[3] పరిశుద్ధపరచబడుట అనగా, పరిశుద్ధముగా ఉండుట. పౌలు ఈ పదమును ప్రయోగించడము వర్ణనాత్మకమును మించినదై యున్నది. వారు ఏమైయుండవలెనని దేవుడు వారిని ఏర్పాటుచేశాడో, వారు అదే లేక అలాగే నిలిచియుండవలెనని అతడు ఈ క్రైస్తవులను సవాలు చేయుచుండెను. వారి జీవితములు, వారు లోకములో ఉన్నవారే కాని వారు లోకసంబంధులు కారనే విషయాన్ని ప్రచురము చేయు పరిశుద్ధతను ప్రతిబింబింపవలసి యుండింది. అదివరకే, పౌలు ఈ పత్రికలో వ్రాసిన పలుకులు క్రీస్తు శరీరమునకు అత్యావశ్యకమై యుండిన ఐకమత్యమును ధ్రువీకరించడం మొదలుపెట్టాయి. కొరింథు సంఘంలో చోటుచేసుకొను చుండిన విభజనలు వారు ఏక శరీరమై యుండవలెనను తాత్పర్యమునకు అవమానకరమై యుండినవి.

కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలో సంబోధింపబడిన సమస్యలు

మరియు ఆందోళనలు నిర్దిష్టముగా కొరింథులోని సంఘము గూర్చి తెలియజెప్పబడుచుండగా, వారి సంఘ సమాజం విశ్వవ్యాప్తమైన సహవాసంలో పాల్గనుచుండినదని కొరింథులోని క్రైస్తవులు అర్థంచేసు కొనవలసిన అవసరముండింది. అది కొరింథులో ఉండిన సంఘమైనా, ఎఫెస్సు సంఘమైనా, లేదా ఇతర పట్టణంలో ఉన్న సంఘమైనా, విశ్వాసులు, పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారితోను, **వారికిని మనకును ప్రభువుగా ఉన్న మన ప్రభువైన యేసు క్రీస్తు నామమున ప్రతిస్థలములో ప్రార్థించువారందరితోను** చేరినవారైయున్నట్టు తమ్మునుతాము లెక్కించుకొన్నారు. వారు దేవుని విమోచన బృహత్కార్యము నుండి బలమును పొందుచు దానికి దోహదపడ్డారు. సకల కాలములయందు సకల చోట్లకు విస్తరించిన రక్షణ సందేశమును ఏర్పాటుచేసియుంచుటలో వారి ప్రేషితోద్యమమేమై యుండినదో కొరింథులోని క్రైస్తవులు అర్థం చేసుకొనవలసి యుండింది. యేసు క్రీస్తు, సకల స్థలములయందున్న సకల విశ్వాసులకు ప్రభువుగా, ఆయన "మనకు" ప్రభువై యున్నట్టుగా, "వారికిని ప్రభువై యున్నాడు."

**వచనము 3.** అపొస్తలుడు కొరింథు సంఘము గూర్చి చేయుచుండిన ప్రార్థన మరియు కలిగియుండిన అనురాగసహితమైన సుహృద్భావము గ్రీకులు వ్రాసుకొనుచుండిన ఉత్తరములలో ఆదర్శమైనవై యుండిన అభివందన పలుకుల్లో వ్యక్తము చేయబడినవి. **కృపాసమాధానములు** మీకు కలుగును గాక అని పౌలు వ్రాశాడు. ఈ మాటలను తేలికగా పరిగణించకూడదు; అవి కేవలము అజాగ్రత్తతో కూడిన అభివందన పలుకులు కావు. విశ్వాసం, పౌలును మరియు కొరింథు సంఘమును కలిసికట్టుగా కట్టివేసింది. **మన తండ్రియైన దేవుడు మరియు ప్రభువైన యేసు క్రీస్తు** వారిని ఒక్కటిగా చేశాడు కాబట్టి వారు ఒక్క ప్రజయై యుండిరి. దేవుని చేత ఏర్పాటుచేయబడిన సరిహద్దులు వారు కలిసి సహజీవనం సాగించుచుండిన అవిశ్వాసులైన జనసమూహముల నుండి వేరు చేశాయి. కృప మరియు సమాధానం వారిపై యుండునని కొరింథు క్రైస్తవులు ఎరిగియుండిరి.

దేవుని పితృత్వము మరియు యేసు క్రీస్తు యొక్క ప్రభూత్వము పౌలునకు కీలకమైన సూత్రములై యుండినవి. గ్రీకు సాహిత్యంలో Zeus (బృహస్పతి) అప్పుడప్పుడు దైవికమైన తండ్రిగా దృష్టించబడ్డాడు; కాని ఇతని పితృత్వము మానవ కుటుంబమును గూర్చిన దాని కంటె ఎక్కువగా ఒలింపిక్ క్రీడలకు సంబంధించిన సర్వదేవగణమును గూర్చినదై యుండింది. పాత నిబంధనలో సహితం, అది మొత్తానికే లేకుండా ఉండనప్పటికిని, దేవుని పితృత్వము పరివ్యాప్తమగు ప్రధానాంశము కాదు (హోషేయ 11:1-4 చూడుము). దేవునికి ఆయన ప్రజల పట్ల గల ప్రేమను మరియు ప్రజలు ఆయన పట్ల కలిగియుండాల్సిన జవాబుదారీతనమును విశ్వాసులు గ్రహించునట్లు పితృత్వము వారికి సహాయపడు ఒక ప్రయోజనకరమైన రూపకాలంకారమై యున్నట్టు యేసు మరియు పౌలు కనుగొన్నారు. తండ్రియైన దేవుడు మరియు ప్రభువైన యేసు క్రీస్తు దేవత్వములో సమానులై యున్నారు. వారి ద్వంద్వత్వములోను మరియు వారి ఏకత్వములోను క్రైస్తవులు కృపాసమాధనములు కనుగొందురు.

## ప్రతి విషయంలో దేవుని మూలమున ఐశ్వర్యవంతులగుట (1:4-9)

వక్తలు మరియు గ్రంథకర్తలు ఏదైన ఒక సంబోధనమును వారికిని వారి శ్రోతలకును మధ్య సత్సంబంధములను నెలకొల్పు మాటలతో మొదలుపెట్టవలెనని గ్రీకులు మరియు రోమనులు కలిసి ఏలుబడి చేయుచుండిన ప్రపంచంలో ఉపన్యాస సామర్థ్యమును ఉపదేశించుచుండిన పాఠశాలలు వారికి నేర్పించాయి. తానే ఒక విద్వాంసుడై యుండిన పౌలు, సందేశములను మరియు సమాచారములను సరైన సరణిలో అందజేయడానికి అవసరమై యుండిన సహాయం కోసం తన లౌకిక పాండిత్యమును ఒక వనరుగా ఉపయోగించుకొన్నాడు. సాంప్రదాయికమైన అభివందన వచనముల తరువాత, దేవుడు వారి మీద కుమ్మరించిన ఆశీర్వాదములను అపొస్తలుడు కొరింథు సంఘానికి జ్ఞాపకం చేశాడు.

**[4]క్రీస్తు యేసు నందు మీకు అనుగ్రహింపబడిన దేవుని కృపను చూచి, మీ విషయమై నా దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. [5-6]క్రీస్తును గూర్చిన సాక్ష్యము మీలో స్థిరపరచబడినందున ఆయనయందు మీరు ప్రతి విషయములోను, అనగా సమస్త ఉపదేశములోను సమస్త జ్ఞానములోను ఐశ్వర్యవంతులైతిరి; [7]గనుక ఏ కృపావరమునందును లోపములేక మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచున్నారు. [8]మన ప్రభువైన యేసు క్రీస్తు దినమందు మీరు నిరపరాధులై యుండునట్లు అంతము వరకు ఆయన మిమ్మును స్థిరపరచును. [9]మన ప్రభువైన యేసు క్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మదగినవాడు.**

ఈ మాటలు మెప్పును తెలియజేసెడివై యున్నవి. దేవుడు కొరింథీయులను ఏర్పరచుకొన్నాడు, కాని వారు తమ కృపను నిశ్చేష్టముగా పొందిన గ్రహీతలై యుండలేదు. వారు దేవుని కొరకు ఒక నిర్ణయమును కూడ చేసుకొన్నారు. పౌలు తన ఉత్తరమందంతటను కోరినట్టుగా, తన పాఠకులు ఏమైయుండవలెనని దేవుడు ఏర్పాటు చేశాడో వారు అదే అయియుండవలెనని అతడు వారిని విన్నవించుకొన్నాడు. వారిప్పుడు దీవింపబడియున్నట్టుగా, దేవుని యొక్క పితృత్వమును మరియు యేసు యొక్క ప్రభుత్వమును ఒప్పుకొనడం ద్వారా క్రీస్తు కొరకైన నిర్ణయమును వారింకా పూర్తిగా చేసుకోలేదు. విశ్వాస విషయకమైన ప్రయాణం యింకా వారి ముందున్నది.

**వచనము 4.** పౌలు సర్వసామాన్యంగా తన పత్రికలను దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు ప్రార్థనతో మొదలుపెట్టాడు (రోమా. 1:8; ఎఫెసీ. 1:6; ఫిలిప్పీ. 1:3; కొలొస్స. 1:3, 4; 1 థెస్స. 1:2, 3; 2:13; 2 థెస్స. 1:3). దేవుడు కొరింథు విశ్వాసుల యెడల చూపించిన కృప కొరకు మరియు వారు ప్రదర్శించిన విశ్వాస సహితమైన ప్రతిస్పందననుబట్టి పౌలు దేవునికి వందనస్తుడై యుంటున్నాడు. సంఘంలో తలెత్తిన సంక్షోభం గూర్చి యోచించినట్లయితే, **మీ విషయమై నా దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను** అని పౌలు వ్రాస్తున్నాడంటే అది గొప్పగా చెప్పుకోదగ్గ విషయమై యున్నది. అట్లయినను, ఈ ప్రార్థన ఒక సాంప్రదాయికమైన

విషయమని కొట్టిపేయబడరాదు. మానవ వైఫల్యాల దృష్ట్యా **క్రీస్తు యేసునందు మీకు అనుగ్రహింపబడిన** కృప సార్థకంగా ప్రయోజనపడుచుండింది. పరిపక్వత కొరవడు సంఘాల్లో సహితం దేవుడు పాపులను నీతిమంతులనుగా తీరుస్తాడు. కొరింథు విశ్వాసులు సువార్తకు విధేయులయ్యారు మరియు దేవుడు వారిని రక్షింపబడినవారి శరీరములోనికి చేర్చుచుండెను గనుక పౌలు కృతజ్ఞుడై యుంటున్నాడు. ప్రజలను విమోచించడానికి క్రీస్తు చేసిన పని నుండి అతని ధ్యాసను దారిమళ్లించుటకు కొరింథులో ప్రత్యక్షమగుచుండిన అజ్ఞానమును మరియు అహంకారమును అతడు అనుమతించలేదు.

క్లుప్తమైనవైయున్న రెండు వాక్యములలో (1:3, 4) పౌలు, **కృప** (χάρις, *charis*) అని అనువదింపబడిన పదమును రెండు సార్లు తనకు అందుబాటులో నున్న వనరుగా ప్రయోగించాడు. అనుగ్రహము మరియు సౌహార్ధము అనేవి దాని సామాన్య అర్థములని తెలియజెప్పుటకు అపొస్తలుడు ఈ పదమును వాడుకోడానికి వెనుకంజవేయలేదు (1:3), కాని 4వ వచనంలో ఈ పదము యొక్క అర్థాన్ని మరొక స్థాయికి తీసుకొని వెళ్లాడు. ఎదురుచూడని, ఉచితమైన, మరియు కనికరముతో కూడిన వరమును “క్రీస్తు యేసు నందు ... అనుగ్రహించడము” ద్వారా దేవుడు ప్రదర్శించిన “కృప” అనేది క్రైస్తవులకు ఒక సాంకేతికపరమైన అర్థంగలదయ్యింది. పౌలు ఈ పత్రికలో వ్యక్తం చేసిన గద్దింపు మరియు దిద్దుబాటంతా దేవుని కృప కొరకు పౌలు కొరింథు సంఘంలోని సహోదరసహోదరీలతో పంచుకొనుచున్న కృతజ్ఞతాస్తుతుల దృష్ట్యా పరిగణింపబడవలసి యున్నది. వారిని ఆవరించియున్న తక్షణ సంక్షోభం ఏదైనప్పటికిని, వారు క్రీస్తునందు పంచుకొనిన ఆత్మసంబంధమైన ఆశీర్వాదములు దేవుడనుగ్రహించుచుండిన వరమై యుండినవని తన పాఠకులు తెలుసుకొనవలెనసేది అపొస్తలుని ఆశయైయున్నది. వారు దేవుని కృపలో ఎదుగుచుండు సందర్భంలో, వారిలో ఉండిన పరిశుద్ధాత్మను ఊపిరాడకుండా చేయుచుండిన విభజనశీలతను మరియు పాపమును వారు అధిగమిస్తారనేది పౌలు యొక్క ఆత్మవిశ్వాసమై యుండింది.

**వచనములు 5, 6.** సమస్త ఉపదేశము మరియు సమస్త జ్ఞానము గూర్చిన అపొస్తలుని పరోక్ష సూచన, ఈ పత్రిక విప్పుకొనుచుండు కొలది అస్పష్టంగా అగపడుతు భయపెట్టుతున్న విషయాలను పరిచయం చేస్తుంటుంది. కొరింథులోని క్రైస్తవులలో కొందరు వారు కలిగియుండిన జ్ఞానము గూర్చి గర్వించుచుండిరి, కాని జ్ఞానము అంటే ఏమిటో అని వారు అర్థం చేసుకొనినది, పౌలు అర్థం చేసుకొనిన దానికి భిన్నముగా ఉండింది (3:18-20). తన పాఠకులు ఆయనయందు **ఐశ్వర్యవంతులైరి** గనుక వారినిబట్టి పౌలు దేవునికి కృతజ్ఞుడై యుండెను; ప్రభువు అనుగ్రహించగోరుచుండిన సమస్తములో వారు ఐశ్వర్యవంతముగా పాలుపంపులుగలవారై యుండిరి. పౌలుకైతే, యేసే సమస్త ఉపదేశము మరియు సమస్త జ్ఞానమునకు మూలాధారమై యుండెను. అపొస్తలుడు ఒక ప్రక్క ప్రావీణ్యతతో వారిని పొగడుచు, అదే సమయంలో వారిని చాకచక్యంగా గద్దించాడు. ఉపదేశము మరియు జ్ఞానము విషయంలో కొరింథీయులకుండిన అహంకారము, ప్రపంచమందంతటను కొనియాడ బడుచు, పౌలు మాటలకు వ్యంగ్యమును మించిన సూచనను సమకూర్చాయి.

కొరింథులోని కొందరు సాహిత్య మీమాంసగల ఆనాటి సమావేశముల చేత నిర్వచింపబడిన వాగ్ధాటికి ఎక్కువ విలువనిచ్చారనే విషయాన్ని ఈ పత్రిక స్పష్టం చేస్తున్నది. వాగ్ధాటితో కూడిన నిపుణతలు ప్రభువు సంకల్పము విషయంలో ప్రయోజనపడవచ్చు, ప్రయోజనపడక పోవచ్చునని పౌలు ఎరిగియుండెను. కొరింథీయులు తమ జ్ఞానమునందు అతిశయించుచుండగా, దీని గూర్చి పౌలు సందేహాలు గలవాడై యుండెను. క్రీస్తునందు వారు దేవుని ఎరిగినవారై, ఆయన గూర్చి మరియు ఆయన ప్రత్యక్షతలు, విమోచన, మరియు నిత్య జీవము గూర్చి వివరంగా మాటలా డుకొనగలిగినవారుగా ఆశీర్వదింపబడ్డారు. కొరింథీయులు మహిమను దేవునికి ఆరోపించుటకు బదులుగా, వాగ్ధాటితో కూడిన ఉపదేశములకు ఎక్కువ విలువనిచ్చుచు జ్ఞానమును మించినది మరొకటి లేదనే భావమును తెలివిగా జోడించినట్టు కనబడుతున్నది.

అపొస్తలుని బోధ అతిశయించడానికి గాని విభజించే పోలికలకుగాని అవకశాం ఇయ్యలేదు. అతడు మరియు కొరింథులోని సహోదరులు జ్ఞానమునకు మరియు సత్యమును గూర్చిన స్పష్టమైన ఉపదేశమునకు ఎక్కువ విలువనిచ్చారు; కాని ఉపదేశములు మరియు జ్ఞానము యొక్క విలువ అంచనా వేయబడుటకు ఆధారంగా నిలిచిన పౌలు ప్రమాణములు మరియు వారి ప్రమాణములు ఒకటి కావు. ఈ సహోదరులు వాస్తవంగానే ఐశ్వర్యవంతులై యుండిరి, కాని వారు తమ చుట్టుముట్టు ఉండిన ప్రజల మనోభావాలను వారు నిరాకరించవలసి యున్నదని క్రీస్తునందు వారు పంచుకొనుచుండిన వరములు వారికి పిలుపునిచ్చుచుండినవని అప్పటికి వారింకా తెలుసుకొనలేదు.

క్రీస్తును గూర్చిన జ్ఞానము పౌలు మరియు ఇతరులు కొరింథీయులకు ఇచ్చిన సాక్ష్యము నుండి ప్రాప్తించినది. యేసు నోటిమాటలయందును మరియు క్రియలయందును తానే క్రీస్తై యున్నాడని ఆయన ప్రదర్శించాడని వారు ధ్రువీకరించుచుండిరి (15:1-4). దేవుడు యేసును మృతులలో నుండి తిరిగి లేపడము ద్వారా నజరేతువాడైన యేసు ఆయన కుమారుడై యున్నాడని ప్రకటించాడు (రోమా. 1:4). కొరింథీయులు ఎరిగియుండిన విషయం గూర్చే అనగా, **క్రీస్తును గూర్చిన సాక్ష్యము వారిలో స్థిరపచబడినదను** విషయాన్ని అపొస్తలుడు వినతి చేశాడు. పౌలుకు మరియు తన తొలి పాఠకులకు పరిచయమున్న పరిస్థితులకు సుపరిచితులుకాని మూడవ గుంపునకు చెందిన పాఠకులు, అపొస్తలిక సాక్ష్యము ఎలా ధ్రువీకరింపబడిందోనని అబ్బురపడుచుందురు. “అపొస్తలుని యొక్క చిహ్నములు మీ మధ్యను నిజముగా కనుపరచబడెను” అని పౌలు అటు తరువాత ధ్రువీకరించాడు (2 కొరింథీ. 12:12). పౌలు కొరింథు పట్టణంలో ఉండినప్పుడు, వారి మీద అతడు తన చేతులనుంచుట ద్వారా పరిశుద్ధాత్మ, కొరింథీయులలో కొందరికి శక్తిని ప్రసాదించాడు. గనుక దీవెనకరమైన ఇట్టి శక్తిని పొందిన గ్రహీతలు, విచక్షణాపూర్వకంగా అద్భుతకార్యములు చేశారు (1 కొరింథీ. 12:7-10).

ఇట్టి అద్భుతకార్యముల ద్వారా బోధింపబడుచుండిన సువర్తమానము నిజముగా ధ్రువీకరింపబడుచుండింది, కాని ఈ సందర్భంలో పౌలు మనస్సులో మరొక ఆలోచన

ఉండవచ్చు. కొరింథీయుల జీవిత విధానంలో చోటుచేసుకొన్న మార్పులను లేదా వారు విమోచింపబడిన ప్రజలై యుండినందున వారు ఆనందంగా అనుభవించిన ఆశీర్వాదములను పరోక్షంగా సూచించుచుండవచ్చు. మార్పునొందిన జీవితాలు పౌలు బోధల్లోని సత్యమును ధ్రువీకరించుచుండినవి. తరువాతి వివరణము ఎంతో ఆకర్షణీయమైనదై యున్నప్పటికిని, అది చాల వరకు అనిశ్చితమైనదై మరియు మాటలకు భావాలకు అందనిదై యున్నది. (βεβαιόω, *bebaioō* అనే గ్రీకు పదము నుండి) "స్థిరపరచబడినది" అని అనువదింపబడిన క్రియా పదము, కుంటివాడు స్వస్థత నొందుట లేదా గ్రుడ్డివానికి చూపు రావటం వంటి అద్భుత కార్యములను వారు చూచిన సందర్భములను కొరింథీయులు జ్ఞాపకం చేసుకొనునట్లు వారిని ప్రోత్సహించింది. "దేవుడు తన చిత్తానుసారముగా సూచకక్రియల చేతను, మహత్కార్యముల చేతను, నానావిధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను, వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారి చేత మనకు దృఢపరచబడెను" అని రచించినప్పుడు, హెబ్రీ పత్రిక రచయిత కూడ "స్థిరపరచబడినది" అని అర్థమిచ్చుచున్న ఇదే క్రియా పదమును ప్రయోగించాడు (హెబ్రీ. 2:3, 4).

**వచనము 7.** తన పాఠకులు ఎంతో గొప్ప ఆత్మసంబంధమైన ఆశీర్వాదములను అనుభవించిన విషయాన్నిరూఢిపర్చడానికి అపొస్తలుడు శ్రమించాడు. వారు దేవుని కృపలో పాలుపంపులుగలవారైనందువలన తత్ఫలితంగా వారు **ఏ కృపావరము నందును లోపము** లేనివారై యుండిరి. వారు ఉపదేశమందును జ్ఞానమునందును ఐశ్వర్యవంతులయ్యారు. క్రీస్తును గూర్చిన సాక్ష్యము వారి మధ్య ధ్రువీకరింపబడింది. కొరింథీయులు ఇన్ని విధములుగా ఆశీర్వదింపబడుచుండిరి కదా, అలాంటప్పుడు, ఈ సంఘంలో అల్పమైన విషయాలు, విభజనలు, గందరగోళం, మరియు లౌకికత్వం ఎందుకు చోటుచేసుకొన్నట్టు? అపొస్తలుడు వారిని కఠినమైన ప్రశ్నలు అడుగక మునుపు, దేవుడు కొరింథీయులలో తన కార్యమును చేయుచుండుట గూర్చి తన ఆత్మవిశ్వాసమును రూఢిపర్చుకొనగోరాడు. ఏదేమైనప్పటికిని, వారు పొందిన ఆశీర్వాదములలో ఏ ఒక్కటైనను వారి సొంత జ్ఞానము, శక్తి, లేదా మంచితనమువలన కలుగలేదను సత్యమును వారు తెలుసు కొనవలెననిపౌలు ఆశించాడు. యుక్తసమయంలో, మానవ జ్ఞానము మరియు శక్తిలో గల సహేతుకముకాని వారి ఆత్మవిశ్వాసమునకు గల ఆధారమును వివరించాలని అపొస్తలుడు వారినడిగాడు (3:18-20).

కొరింథీయులు "ఏ కృపావరము నందును లోపములేనివారై" యుండగా, నానా విధములైన వరముల స్వభావం గూర్చి ఎక్కువగా చర్చింపబడుచుండింది. "వరము" అనేది χάρισμα (*charisma*) అనే గ్రీకు పదము యొక్క అనువాదమై యున్నది. ఈ పదము పౌలు పత్రికల్లో పదహారుసార్లు, పేతురు వ్రాసిన పత్రికలో ఒకసారి కనబడుతున్నది (1 పేతురు 4:10). పౌలు రోమా పట్టణమునకు చేరుకొన్నప్పుడు, అచ్చటి క్రైస్తవులకు "ఆత్మసంబంధమైన కృపావరమేదైనను" వారికియ్యవలెనని నిరీక్షించుచుండెను (రోమా. 1:11). గ్రీకు భాషలో, 1 కొరింథీ. 12వ అధ్యాయంలో ఈ పదము ఐదు సార్లు కనబడుతుంది. కొరింథీయులకు అనుగ్రహింపబడిన అద్భుత

కార్యములు చేయ శక్తిగల వరములు, "ఒకే పరిశుద్ధాత్మ చేత" అనుగ్రహింపబడినవి (12:4). *Charisma* అనే గ్రీకు పదము ప్రత్యేకమైన, సహజాతీతమైన వరదానములను సూచించుచున్నదని ఈ సందర్భ ములలో సువిదితమగుచున్నది; కాని పౌలు కొన్ని పర్యాయాలు ఈ పదమును అద్భుతకార్యముల గూర్చి స్పష్టంగాలేని ప్రస్తావన సందర్భంలో సహితం ప్రయోగించాడు. ఉదా|| రోమా. 11:29, "దేవుడు తన కృపావరముల విషయములోను, పిలుపు విషయములోను పశ్చాత్తాపపడడు" అని చెప్పుతున్నది. అట్లయినను, 1 కొరింథీ. 1:7 వ్రాయుచుండినప్పుడు పౌలు మనస్సులో సహజాతీతమైన వరము లుండుట సాధ్యమే అని రెండు ఆలోచనలు చెప్పుచున్నవి. మొదటిది, సంబంధిత సందర్భంలో కొరింథీయులు పొందిన ఆశీర్వాదముల సంపూర్ణత గూర్చిన ప్రస్తావన ద్వారా పౌలు వారి విశ్వాసమును ధ్రువీకరించుచుండెను. ఈ "సంపూర్ణత"లో అద్భుతకార్యములు చేయ శక్తి గల వరములుండినవి. రెండవది, కొరింథీయులు అద్భుతకార్యములు చేయ శక్తి గల వరములకు పెడదోవపట్టింపబడిన ప్రాధాన్యతను ఇచ్చారు (12:29-31). ఈ సమస్య 1:7లో పేర్కొనబడి, 12:29-31లో అతని దిద్దుబాటు కొరకు ఎదురుచూచుచున్నది.

కొరింథు క్రైస్తవులకు ఆత్మ సంబంధమైన వరములు లోపించలేదు, కాని దేవుని రూపకల్పనల గూర్చిన సువిశాల దృక్పథము పరిగణింపబడినప్పుడు మాత్రమే వరములు ప్రాముఖ్యమైనవై యుండినవి. తన పాఠకులు వారి సావధానమును మన **ప్రభువైన యేసు క్రీస్తు ప్రత్యక్షత** పట్ల మళ్లింపవలెనని కోరినప్పుడు పౌలు తన దృష్టికోణాన్ని చేర్చాడు. నేర్పుతో కూడిన కదలికతో, వారొక సమాప్తి కోసం ఎదురుచూచుచున్నారని అతడు కొరింథీయులకు జ్ఞాపకం చేశాడు. ప్రభువు రాకడ కొరకు నిరీక్షిస్తూ జీవించినప్పుడు, వరముల మరియు పరువుప్రతిష్ఠల వన్నియే భిన్నమైన వర్ణమును ధరిస్తుంది. కొరింథీయులు ఏ విధమైన ఆత్మసంబంధమైన వరములు లేదా జ్ఞానమును ఆనందంగా అనుభవించినను, క్రీస్తు రాకడయే, "మన ప్రభువు యొక్క ప్రత్యక్షతయే," ఆతురతతో కూడిన వారి ఆశయై యుండింది. క్రీస్తు సంఘం ఎల్లప్పుడు తన దృష్టిని దిగంతము మీద నిలుపుతూ జీవించాల్సి వున్నది, ఏలయనగా "అన్నిటి అంతము సమీపమై యున్నది" (1 పేతురు 4:7).

క్రైస్తవులముగా, దేవుని కృప చొప్పున, మనము అంతము వరకు పట్టువిడువకుండా కొనసాగగలమను హామీ మనకున్నది; కాని పట్టుదల అనేది ముందుగానే నిశ్చయింపబడిన ఒక ముగింపు కాదు. "తానే భ్రష్టుడైపోవునేమో" అనే సాధ్యత గూర్చి పౌలు అటుతరువాత యోచించాడు (1 కొరింథీ. 9:26, 27). ప్రభువునందు విశ్వాసముంచు వానిని, ఏ లౌకిక శక్తియైనను ప్రభువు యొక్క ప్రేమ నుండి వేరుచేయజాలదు (రోమా. 8:38, 39). యేసు మనకు సహాయకర్త మరియు స్నేహితుడు. ప్రభువు తన వారిని క్షమిస్తాడు, స్వాధికారంతో చేర్చుకొంటాడు.

**వచనము 8.** 1:7లోని, "మన ప్రభువైన యేసు క్రీస్తు ప్రత్యక్షత" అని అన్నప్పుడు, 1:8లోని మన **ప్రభువైన యేసు క్రీస్తు** దినము గూర్చి మరొక విధంగా చెప్పుకొనడమని అర్థం. చరిత్ర ప్రభువు రాకడ, ఇహలోక ఉనికి మరియు కాలము యొక్క ముగింపు దిశగా సాగిపోతున్నది. రోగి బాధలో ఉన్నప్పుడు వినిపించు మూలుగుతో కాలము

గతించిపోవు వరకు మానవాళి కుటుంబము అస్తవ్యస్తముగా కదలిపెళ్లుచుండదు. ఏలయనగా కాలము దొర్లిపోవుచుండు కొలది దేవుడు ఉద్దేశమును మరియు దిశానిర్దేశనమును అనుగ్రహిస్తాడు.

"ప్రభువు దినము" పాత నిబంధనలో ఒక ప్రాముఖ్యమైన భావనయై యున్నది. ఈ దినము ప్రవక్తల చేత వాడుకొనబడుట క్రొత్త నిబంధనలో గల దీని అర్థమును వివరించడానికి సహాయకరంగా ఉంటుంది. ప్రభువు తన ప్రజలను రక్షించుటకు లేదా శిక్షించుటకు శక్తిమంతముగా తన కార్యమును చేయు ఏ దినమునైనను సూచించడానికి ప్రవక్తలు "ప్రభువు దినము" అనే పదజాలమును ప్రయోగించారు. క్రొత్త నిబంధనలో, "ప్రభువు దినము" స్థిరముగా ప్రభువు రాకడ దినమై యున్నది. ప్రభువు తిరిగి వచ్చుననే నిశ్చయత క్రైస్తవులకు కచ్చితంగా తెలియును, కాని కచ్చితమైన సమయం తెలియదు; రాత్రి వేళ దొంగ ఏలాగు వచ్చునో ఆలాగే ప్రభువు దినము వచ్చుననే వివరము అందుకుగల ఒకే ఒక్క ఆచూకీయై యున్నది (మత్తయి 24:36; 1 థెస్స. 5:2 చూడుము).

**వచనము 9.** రక్షణ గూర్చిన హామీ దేవుని విశ్వసనీయతపై ఆధారపడి యున్నది. నిజమైనఒక్క దేవుడు,వారిదేవతలు చలపచిత్తముగలవారై యున్నారని గ్రీకులు అర్థం చేసుకొన్నట్టు, చపలచిత్తముగలవాడు కాదు. **దేవుడు నమ్మతగినవాడు** గనుక ఆయన తన పిల్లల ప్రక్కన నిలువబడి యుంటాడు. **తన కుమారుని సహవాసమునకు** అనేది 1:9లోని గ్రీకు పదజాలమునకు బహుశా ఉత్తమమైన అనువాదమై యుంటుంది; అది సంబంధ సూచక విభక్తితో కూడినదై యున్నది గనుక "తన కుమారుని యొక్క సహవాసమునకు" అనేది దాని అక్షరార్థమై యున్నది. క్రైస్తవులు ఒకరితో నొకరు పంచుకొను సహవాసము క్రీస్తుతో గల సమష్టి సహావసమునుబట్టియే సాధ్యమవుతున్నది (1 యోహాను 1:6, 7).

క్రీస్తునామమును పౌలు ఎడతెరిపిలేకుండా ప్రయోగించుచుండుటను బట్టి, పౌలు ఆలోచన అంతా క్రీస్తులో వేరూనినదై యుండినదనే విషయం విదితమవుతున్నది. తన పత్రికను మొదలుపెట్టినది మొదలుకొని దానిని ముగించునంత వరకు అతడు యేసు క్రీస్తును కొరింథీయుల యెదుట ఉంచాడు. తన సొంత శక్తి లేదా జ్ఞానముపై ఏమాత్రమును ఆధారపడక, పౌలు తన ధ్యాస అంతటిని ప్రభువుపైనే కేంద్రీకరించి యుంచాడు. పౌలు యొక్క ప్రతి చర్య మరియు ప్రతి ఆలోచన నశించినవారిని నిత్య జీవమునకు పిలుచువాని మహిమార్థమైనవై యుండింది.

## సంఘములో చోటుచేసుకొనిన విభజనల గూర్చిన పౌలు హెచ్చరిక

## (1:10-17)

తన పత్రికను వ్రాయుచుండిన పౌలు, కొరింథీ సంఘం పౌలుకు పంపించిన అనేక ప్రశ్నలకు సమాధానమిచ్చాడు. అతడు ఈ ప్రశ్నలకు జవాబియ్యక ముందు, క్రీస్తు శరీరంలో చోటుచేసుకొనిన విభజనల గూర్చి మాటలాడాలని ఆశించాడు (1:10-4:21).

పౌలు ఆలోచనలన్నీ ఇటీవలనే కొరింథు సంఘము నుండి అందిన విభజన సమస్య గూర్చిన సమాచారంలో నిమగ్నమయ్యాయి. కొన్ని విధాల్లో, సంఘములో చోటుచేసుకొనుచుండిన కొట్లాటలు మరియు అభిప్రాయభేదాలు అపొస్తలుడు పరిష్కరించడానికి విపరీతమైన సంక్షోభమును కలిగించుచుండిన సమస్యలై యుండినవి. కొరింథులోని కొందరు క్రైస్తవులు పౌలు పట్ల ప్రదర్శించుచుండిన విశ్వాసపాత్రమునుబట్టి అపరిమితంగా అతిశయించుచుండిరి. క్రీస్తు శరీరము యొక్క ఐక్యత కంటె అపొస్తలుని దృష్టిలో ఇతరమైన కొన్ని విషయాలు ఎక్కువ ముఖ్యమైనవై యుండినవి (ఎఫెసీ. 4:4-6). తన పేరును సంఘ విద్రోహ ముఠా పక్షంలో చేర్చుకొనుచుండిన వాడు పౌలుకు ఎంతో బాధ కలిగించుచుండెను. ఈ రోజుల్లో సంఘ స్థాపనముల పరిచర్యలను చేపట్టిన పరిచారకులు సాక్ష్యమిచ్చుచున్నట్టుగా, నూతనంగా నెలకొల్పబడు సంఘ సమాజములు విభజనల విషయంలో సులభంగా ప్రభావితమగుట వింతగా నున్నది.

కొరింథు సంఘం విభజన పట్ల చూపిన ఉన్ముఖతకు అనేక విషయాలు దోహదపడి యుండవచ్చు. సహోదరులు నానా విధములైన ఆత్మసంబంధమైన వరములు కలిగియుండిరి, కాని క్రైస్తవ విశ్వాసం మరియు సంబంధిత అభ్యాసం అనగా ఏమిటో నిర్వచింపబడి, అధికారపూర్వకంగా లిఖిత రూపంలో ఇవ్వబడిన వివరం వారికి లేదు. క్రొత్త నిబంధన దాని రూపురేఖలను రూపించుకొను ప్రక్రియను యింకను కొనసాగించుచుండినది. రెండవది, వారు స్వతంత్రంగా ఆలోచించగలరని కొరింథు విశ్వాసులు తమ్మునుతాము ఋజువుచేసుకొన్నారు. వారు క్రొత్త వ్యక్తుల మాటలు ఆలకిస్తూ క్రొత్త ఆలోచనలను ఆహ్వానించారు; లేదంటే, వారు పౌలు బోధలు వినేవారు కాదు, వారితో సమానులైనవారి మధ్య సుస్థితిలేని మతమును ఆలింగనము చేసుకొనెడివారు కాదు. వారు పౌలు బోధించిన సందేశాలను అంగీకరించడానికి బాహాటంగా ఉండిన అదే మనస్సు వారిప్పుడు అతని బోధలు వక్రీకరింపబడుచుండిన పరిస్థితి చేత సులభంగా ప్రభావితులగునట్లు చేయుచున్నది. మూడవది, కొరింథు, ఏ ఉపదేశకుడైనా తన బోధలను తన చుట్టూర ఉన్న వారికి వినిపించుటకు వీలుగా ఉండిన పట్టణమై యుండింది. ఆనాటి యుగంలో ప్రబలియుండిన తత్త్వ ప్రవాహములకు స్థానికులు అలవాటుపడిపోయారు. తత్ఫలితంగా ఉపదేశకుల పట్ల లేదా ఏదైన ఒక పక్షం పట్ల ప్రదర్శింపబడాల్సిన విశ్వాసపాత్రమును నిర్వచించు వాక్యములను రచించుకొనడము మరియు పునరచించుకొనడము పరిపాటైపోయింది. విభజించు శక్తులు సంఘంలో పనిచేయుచున్నట్లు కనుగొనినప్పుడు పౌలు ఆశ్చర్యపడకపోయి యుండవచ్చు, కాని తామంతా కలిసి ఒక పక్షంగా ఏర్పడాలని ఎవరైనా అతనిని విన్నవించుకొనుటను అతడు ఇష్టపడలేదు.

## "సహోదరులారా, సమైక్యతను కాపాడుకొనండి" (1:10)

**10సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు,**

**మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట మిమ్ము్మను వేడుకొనుచున్నాను.**

**వచనము 10.** 1:9లో, "తన కుమారుని సహవాసమునకు" అని అపొస్తలుడు పేర్కొనడం, 1:10లో మొదలవుతున్న సమైక్యత కొరకైన విన్నపము చేయడానికి మార్గమును సుగమం చేసింది. క్రీస్తుతో నుండు సహవాసం క్రైస్తవులను ఐకమత్యంతో కట్టిపెట్టుతుంది, కాని కొరింథు విశ్వాసులు తమ సొంత ఇష్టాయిష్టాల వెంబడి పరుగెత్తుచుండినందు వలన ఈ ఐకమత్యము గూర్చి వారు పట్టించుకొనలేదు. తన పత్రికలలోని ఇతర చోట్ల వలెనే, ఇచ్చట పౌలు తన మనస్సులోని మాటను బట్టబయలు చేయుచుండెను. మధ్యస్థమైన, పాండిత్య ప్రదర్శకమైన పత్రిక కాదు. కొరింథీయులకు వ్రాయబడిన పత్రికల్లో కనికరము, సానుభూతి, నిరాశ, మరియు కోపము స్పష్టంగా కనబడుతున్నాయి. **సహోదరులారా** అనే బహువచన సంబోధనం కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలోనే 27సార్లు ఉపయోగింపబడింది. అలాగైతే, ఇట్టి సహోదరత్వము విషయంలో కొరింథు సంఘం ఎలా రాజీపడగలిగింది? క్రైస్తవులు ముఠాలుగా, ఆ యా పక్షములుగా ఏర్పడ్డారు. అపొస్తలుడు మృదువుగా మొదలుపెట్టాడు. ప్రస్తుత పరిస్థితులతో వారు తృపిచెంది యుండకూడదని అతడు వారిని విన్నవించుకొన్నాడు. వారు కలిసి మెలిసి యుండాలని, ఏక మనస్సు ఏక హృదయంగలవారై యుండాలని పౌలు ఆశించాడు. ఈ విన్నపము పౌలు ఒక్కడే చేయలేదు, అది **మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట** చేయబడింది.

విశ్వాసుల మధ్య **విభజనలు** వెవ్వేరు స్థాయిలలో ఏర్పడవచ్చు. అయితే ఏ ఒక్క విభజనయైనను అంగీకరింపదగినది కాదు. ప్రభువు ప్రజల చేత సంఘటితమైన వ్యక్తిగత సంఘ సమాజములు కొన్ని పర్యాయాలు ఇతర సంఘ సమాజములతో సహవాసం చేయడానికి నిరాకరిస్తాయి. పరిస్థితులు నానా విధములుగా ఉంటాయి. కొన్ని సార్లు బైబిలు సంబంధమైన బోధలను కొట్టివేస్తూ, వాటితో పొంతనలేని పద్ధతులను అభ్యసించడానికి సంఘము అనుకూలించుకొనినప్పుడు విభజనలు తలెత్తుతాయి. మరొక చోట ఆరాధించు తోటి సంఘ సభ్యులపై సంబంధిత సంఘం దాని అభిప్రాయాలను మరియు ఇష్టాయిష్టాలను విధించినప్పుడు కూడ విభజనలు ఏర్పడుతాయి.

కొన్ని విభజనలు సంఘ సమాజ స్థాయిని దాటి వెళ్లవు. తన పాఠకులు ఏకభావముతో మాటలాడవలెననియు, **ఏక మనస్సుతో మరియు ఏక తాత్పర్యంతో మీరు సన్నద్ధులై యుండవలెనంటూ** పౌలు వారిని బ్రతిమాలినప్పుడు, కొరింథు సంఘము యొక్క అంతరంగిక విషయాల గూర్చి అతడు ఆలోచించుచుండెను. ఒక సంఘంలోని విభజనలు వ్యక్తిగతమైనవై ఉండుటకు ఎక్కువ ఉన్ముఖత కలదు, కాని సంఘంలోని పెద్ద పెద్ద విషయాల వలన ఏర్పడు విభజనల కంటె ఇవేమీ తక్కువ వినాశకరమైనవి కావు. క్రైస్తవులు ఒకరినొకరు ప్రేమించవలెను, ఒకరి యెడల ఒకరు మర్యాదగా మెలగవలెను మరియు ఒకరినొకరు గౌరవించ వలెనని పలుమార్లు చెప్పడానికి క్రొత్త నిబంధన కేటాయించుచున్న భాగము గమనార్హమైనదై యున్నది. సంఘ సమాజ స్థాయిలో ఐకమత్యమును నిర్వహించుకొనడం ద్వారా ప్రభువును గౌరవించడానికి పడు ప్రయాసము కంటె, విశ్వాస విషయికమైన ఏ పరీక్షయైనను అంత అధికంగా

అపేక్షించునదై యుండదు.

## "మీ ముఠాలకు ఎటువంటి ఆధారమైనను లేదు" (1:11-16)

**[11]నా సహోదరులారా, మీలో కలహములు కలవని మిమ్మును గూర్చి క్లోయె యింటివారి వలన నాకు తెలియవచ్చెను. [12]మీలో ఒకడు-నేను పౌలువాడను, ఒకడు- నేను అపొల్లోవాడను, మరియొకడు-నేను కేఫావాడను, ఇంకొకడు-నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము.**

**[13]క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా? [14-15]నా నామమున మీరు బాప్తిస్మము పొందితిరని యెవరైనను చెప్పకుండు నట్లు, క్రిస్పునకును గాయియుకును తప్ప మరి యెవనికిని నేను బాప్తిస్మమియ్యలేదు; అందుకై దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను. [16]స్తెఫను యింటివారికిని బాప్తిస్మమిచ్చితిని; వీరికి తప్ప మరి ఎవరికైనను బాప్తిస్మమిచ్చితినేమో నేనెరుగను.**

**వచనము 11.** క్లోయె క్రైస్తవురాలైన వ్యాపారియై యుండెననియు, అతనికి సంబంధించినవారు వ్యాపార రీత్యా కొరింథు మరియు ఎఫెస్సు పట్టణముల మధ్య పయనించుచుండిరనియు ఒకరు అతి త్వరగా భావింపవచ్చు. పేరు మాత్రం స్త్రీకి సంబంధించినదై యున్నప్పటికిని, ఆమె క్రైస్తవురాలై యుండినదని మనము కచ్చితంగా చెప్పలేము. "క్లోయె యింటివారు" అనే అనువాదం తప్పు దోవ పట్టించవచ్చు, ఎందుకనగా సంబంధిత గ్రీకు పదజాలము కొందరు క్లోయెతో కొంత సంబంధంగలవారై యుండిరని తెలుపుతున్నది. ఆమె కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధులు ఎన్నో విధాలుగా పౌలుతో సంబంధం ఏర్పరచుకొనియుండవచ్చు. క్లోయె తానే కొరింథు పట్టణవాసిగాని లేదా ఎఫెస్సు పట్టణవాసిగాని అయియుంటుంది. ఆమె ఎవరై యుండినప్పటికిని, కొరింథులోని క్రైస్తవ సమాజంలో తలెత్తిన ముఠాలు మరియు కలహము గూర్చి పౌలు **క్లోయెకు** సంబంధించినవారి ద్వారా తెలుసుకొన్నాడు. క్లోయె సంబంధులు ఈ విషయాలను తెలుసుకోడానికి వారు క్రైస్తవ సమాజములో పాల్గొనుచుండుట అత్యంత సువిధజనకమైన మార్గమై యుండింది. సంఘంలో **కలహములు కలవని** పౌలు తెలుసుకొన్నాడు. ఇది పౌలు మనస్సులో కలత కలిగించుచుండిన పరిణామమై యుండింది.

**వచనము 12.** ఈ వచనములోని పదజాలములను అతి జాగ్రత్తతో అంచనా వేయాల్సి వుంటుంది. వీటి అర్థవివరణ కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలోని తొలి అధ్యాయములను అర్థంచేసుకొనడమును ప్రభావితం చేస్తుంది. కొరింథు సంఘంలో పనిచేయుచుండిన అల్పమైన, విభజించే గుణముగల స్ఫూర్తి గూర్చి అపొస్తలుడు ఒక వ్యంగ్య చిత్రమును వారి ముందుంచుచుండెనని కొందరు సూచిస్తుంటారు. ఏదేమైనప్పటికిని, ఈ విభజనల గూర్చి పౌలు 3వ మరియు 4వ అధ్యాయంలో ఆ యా పక్షములకు సంబంధించిన ఉపదేశకుల పేర్లతోసహా వివరించాడంటే, ఈ పేర్లుగల వారితో

అసలైన పార్టీలు ఏర్పడ్డాయని స్పష్టంగా అర్థమవుతున్నది. **నేను పౌలువాడను** లేదా **నేను అపొల్లోవాడను** మున్నగు నినాదాలను ఈ ముఠాలు అనుకూలించుకొన్నాయి, కాని పార్టీలుగా ఏర్పడటమును ఈ ఉపదేశకులు తామే ప్రోత్సహించారనడానికి అంతస్సూచన ఏదీ లేదు. వర్గములను ఏర్పాటు చేసుకొనడం, అది కొరింథీయులు చేసిన పనైయున్నది.

పౌలు మరియు అపొల్లో కొరింథు పట్టణమును సందర్శించారని బైబిలు చదువరులకు తెలియును, కాని పేతురు[4] కూడ సందర్శించాడో లేదో స్పష్టంగా తెలియదు. అపొస్తలుల కార్యముల పుస్తకంలో, యెరూషలేము మహా సభ సమావేశమైన సందర్భములో పేతురు పేరు చివరిసారిగా పేర్కొనబడింది (అపొ. 15:7). ఈ సభాసమావేశం ముగిసిన తరువాత ఏదో ఒక సమయంలో అతడు యెరూషలేమును విడిచి వెళ్లి కొరింథులో కొంత సమయం గడిపియుండవచ్చు. లేదా పర్యాయంగా, యెరూషలేము సంఘము యూదు క్రైస్తవులకిచ్చిన సిఫారసు పత్రికలు (2 కొరింథీ. 3:1) కొరింథుకు చేరుకొని, పేతురు పేరట వచ్చాయని స్వాధికారంతో చెప్పుకొనియుండవచ్చు. అపొ. 15:1 మరియు గలతీ. 2:11, 12 కలిపి చదువుకొన్నప్పుడు, పౌలును వ్యతిరేకించుచుండిన యూదు క్రైస్తవులు పౌలు పనులకు నష్టం కలిగించాలని కొన్ని పర్యాయాలు ఎలా అతని వెంటబడి వచ్చారో అర్థమవుతుంది. ఇంకా, పౌలు కొరింథీయులకు తన మొదటి పత్రికను వ్రాసిన రెండు సంవత్సరములలోపే, అన్యజనుల విషయంలో మోషే ధర్మశాస్త్రమును తప్పనిసరిగా విధించాలని పట్టుబట్టిన కొన్ని గుంపుల చేత సంఘంలోని కొందరు ప్రభావితులయ్యారు (2 కొరింథీ. 3:4-11). పేతురుకు ఎరుకలేకుండానే పేతురు వారి పార్టీకి నాయకుడై యున్నాడని కొందరు స్వాధికారంతో ప్రకటించి యుండవచ్చు.

పేతురు గూర్చిన విషయం ఏమైయున్నప్పటికిని, ఈ పట్టణమునకు క్రీస్తు రాలేదు. వచ్చియుండినట్లయితే, "క్రీస్తు ముఠా" ఒకటి ఏర్పడియుండి నట్లయితే, పరిస్థితి యింకెలావుండేదో! అట్లయినను, వారందరు క్రీస్తుకు చెందినవారై యుండలేదా? పౌలు ముఠాల గూర్చి మరొక పర్యాయం 3:4-9లో పేర్కొనినప్పుడు, తన పేరును మరియు అపొల్లో పేరును మాత్రమే పేర్కొన్నాడు. 3:22లో కేఫా పేరు అదనంగా పేర్కొనబడినట్లు మనము గమనిస్తాము, కాని ఈ సందర్భం ముఠాసమస్యల గూర్చినది కాదు. పౌలు మరియు అపొల్లో కొరింథీయుల మధ్య ప్రధాన నాయకులై యుండినందు వలనను, వారి వ్యక్తిగత ప్రత్యేక లక్షణములు చెప్పుకోదగినంతగా భిన్నమైనవై యుండినందువలనను, పట్టణంలోని క్రైస్తవులలో కొందరు ఈ ఇరువురిలో ఒకరిని తమకు నాయకునిగా పరిగణించారు.

తత్త్వశాస్త్రమునకు సంబంధించిన భేదములచేత ఆకర్షింపబడినందు వలన విభజనలు ఏర్పడియుండవచ్చు. అటుతరువాతే ఒక గుంపు వారు పౌలును హత్తుకొన్నారు, మరొక గుంపువారు అపొల్లోను హత్తుకొన్నారు. ఈ మేళనమునకు ఇతర పేర్లను చేర్చడం ద్వారా, వారి ప్రవర్తన హేతు విరుద్ధమైనదై యుండిందని పౌలు చూపించాడు. "పేతురు ముఠాను ప్రవేశపెట్టుదాము," "క్రీస్తు ముఠాను ప్రవేశపెట్టుదాము, రండి" అని అతడనియుండవచ్చు. కొరింథులోని ముఠాతత్వాలు వ్యక్తిగత ఇష్టా యిష్టాలు

మరియు తత్త్వశాస్త్ర సంబంధమైన సుముఖతల మీద ఆధారపడినవై ఈ విషయాల్లో పౌలు అనుకూలంగా ఉంటే పౌలు పక్షం వహించడం లేదా, అపొల్లో ఎక్కువ అనుకూలంగా ఉండినట్లయితే అపొల్లో పక్షం వహించినట్లు కనబడుతున్నది. "మేము పేతురు పక్షం," మరియు "మేము క్రీస్తు పక్షం" అని స్వాధికారంతో చెప్పుకొనిన పార్టీలుండినట్లయితే పేతురు పార్టీ, గలతీయ సంఘంలో పౌలు వెంటబడిన ఉపదేశకుల వంటిదై ఉండియుంటుంది (గలతీ. 5:3-6). నిజముగానే క్రీస్తు పక్షం వహించిన పార్టీ ఉండినట్లయితే, సంబంధిత సభ్యులు వారు ప్రభువు పట్ల ప్రభుభక్తిగలవారై ఆయనను హత్తుకొనియున్నారు గనుక పార్టీలలో అత్యున్నత ఆధిక్యత వారిదేనని వారు స్వాధికారంతో ప్రకటించి యుందురు, ఏలయనగా ఇట్టి ప్రభుభక్తి వారిని ఇతరుల కంటె ఎక్కువ భక్తిపరులను గావించుచుండినదని వారు భావించారు.

వెవ్వేరు పార్టీలవారు వెవ్వేరు విషయాలను ఉపదేశించారనే సూచనను పౌలు ప్రతిపాదించడం లేదు. ప్రాచీన ప్రపంచంలో, అంతా వ్యక్తిగతమైన ప్రభుభక్తియై యుండింది; సూత్రముల పట్ల ప్రభుభక్తి తరుచుగా ప్రదర్శింపబడలేదు. పౌలు, అపొల్లో, మరియు పేతురు కూడ, ఆ మాటకొస్తే, వారు వెవ్వేరు విషయాలను నొక్కి వక్కాణించినప్పటికిని, విశ్వాస సంబంధమైన ప్రధాన సిద్ధాంతముల విషయంలో ఏక మనస్సుగలవారై యుండిరి. అపొల్లో గూర్చి అపొస్తలుల కార్యముల పుస్తకంలో ఇవ్వబడిన వర్ణన ప్రకారం, అపొల్లో ఒక వక్త మరియు విద్వాంసుడై యుండెనని తేటతెల్లమవుతున్నది. లోక జ్ఞానమును గొప్పగా పరిగణించిన సమాజంలో గౌరవార్హత కొరకు వెదకుచుండినవారి దృష్టిలో అతడే ఎక్కువ అనుకూలమైనవాడై ఉండియుండవచ్చు. తక్షణంలో, వారే ఇతరుల కంటె ఉత్తమమైనవారై యున్నారని వారనుకొనుచుండినట్లు కనబడుతున్నది.

**వచనము 13.** అపొస్తలుడు భావోద్రేకరహితంగా వర్ణించిన విషయాలు వెనువెంటనే చికాకుగా మారాయి. గనుక అతడు **క్రీస్తు విభజింపబడి యున్నాడా?** అని ప్రశ్నిస్తూ ప్రశ్నల పరంపరను మొదలుపెట్టాడు. ఎవరైనా గాని క్రీస్తును విభజించి పంచిపెట్టగలడా? అపొస్తలుని విషయంలోనైతే, క్రీస్తు శరీరమును (సంఘమును) ముక్కలు ముక్కలుగా విభజించడము అనంటే, ప్రభువునే ముక్కలు ముక్కలుగా విభజించడమవుతుంది. సంఘము క్రీస్తు శరీరమై యున్నది (ఎఫెసీ. 1:22, 23). భూతకాలీనమైన ఒక గ్రీకు అనువాదము (μεμέρισται, *memeristai*), "క్రీస్తు విభజింప బడియున్నాడా?" పౌలు అవగాహనకు సరిపోతున్నది. అపనమ్మకము సమాధానమును స్వాధికారపూర్వకంగా కోరినది: "క్రీస్తు శరీరమును ముక్కలుగా విభజించడానికి నీవు సాహసించావా?"

"అపొల్లోగాని లేదా కేఫాగాని మీ కొరకు సిలువవేయబడ్డారా?" అని పౌలు అడిగియుండవచ్చు, కాని విషయాల పరిస్థితి వ్యక్తిగతంగా కాటువేసి యుంటుంది. ఇతరులు తమ విషయమై తాము మాటలాడగలరు; తన పేరు మట్టుకు డాగు లేనిదై యుండవలెనని పౌలు ఆశించుచుండెను. **పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా?** అతని పేరు చెప్పుకొనడం లేదా పెట్టుకొనడమంటే, అతడు ప్రభువై యున్నాడని తాను స్వాధికారంతో చెప్పుకొనడమవుతుందని అపొస్తలుడు నమ్మియుండవచ్చు. ఈ ఆలోచనయే అతన్ని భయభీతున్ని గావించింది.

పౌలడిగిన మూడవ ప్రశ్న - లేదా, **పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?** - ప్రత్యేకించి ఆసక్తికరంగా ఉన్నది. బాప్తిస్మము పొందుట మరియు క్రీస్తునందుండుటకు మధ్య అపొస్తలుడు కుదిర్చిన సంబంధం గూర్చి ఈ ప్రశ్న వెలుగును విరజిమ్మే పరిజ్ఞానమును కలిగించుచున్నది. ఈ ప్రశ్న వేయడం ద్వారా, బాప్తిస్మము పొందకుండా క్రైస్తవుడై యుండుట అనేది ఊహాతీతమై యున్నదని పౌలు ఋజువుపర్చుచుండెను (రోమా. 6:3, 4 చూడుము). "పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా?" అని అడిగినప్పుడు, క్రీస్తు, పౌలు కాదు, వారి కొరకు సిలువవేయబడెననేది దాని అంతర్భావమై యుండెను. ప్రశ్నకు వెనువెంటనే అతడు వారు పొందిన బాప్తిస్మమునకు సంబంధించిన విన్నపము చేశాడు. సిలువ వలన కలుగు ప్రయోజములలో వారు పాలు పంచుకొన్నారనుటకు వారు పొందిన బాప్తిస్మము సాక్ష్యమై యున్నదని తన పాఠకులు అర్థంచేసుకొంటారని అతడు వారిపై ఆధారపడగలిగి యుండెను (కొలొస్స. 2:12 చూడుము).

**వచనములు 14, 15.** ఒకడు పౌలు నామములో బాప్తిస్మము పొందడానికి పౌలే వ్యక్తిగతంగా వానికి బాప్తిస్మమియ్యవలసిన అవసరం లేదు. అట్లయినప్పటికిని, ఇటువంటి విషయాలతో అతనికి ఎటువంటి సంబంధమైనను లేదని అందరు అర్థం చేసుకోవాలని అపొస్తలుడు ఆశించాడు. పౌలు వారికి బాప్తిస్మమిచ్చినట్టు కొందరు సాధికారంతో చెప్పియుండవచ్చు, అయితే పౌలు తన సొంత నామములో వారికి బాప్తిస్మమిచ్చాడని ఏ ఒక్కరైనను చెప్పలేదు. ఇట్టి అవగాహన విషయంలో పౌలు అదిరిపోయాడు.

ఒక్క క్షణంలో, తాను వ్యక్తిగతంగా బాప్తిస్మమిచ్చిన ఇద్దరిని అపొస్తలుడు జ్ఞాపకానికి తెచ్చుకొన్నాడు: **క్రిస్పు మరియు గాయియు**. పౌలుఈ ఇరువురికి ఎందుకు బాప్తిస్మమిచ్చాడో మనమూహించుకొన వలసిందే. ఈ ఇరువురు సిరిమంతులు మరియు ప్రముఖులునై యుండినట్టు కనబడుతున్నది. పౌలు కొరింథు పట్టణంలో ఉన్నప్పుడు రోమీయులకు తన పత్రిక వ్రాసినప్పుడు, అతనికిని మరియు కొరింథు సంఘమంతటికిని గాయియునే స్వయంగా ఆతిథ్యమిచ్చాడని పేర్కొన్నాడు (రోమా. 16:23). గాయియునకు ఒక సువిశాలమైన ఇల్లుండినదని స్పష్టమవుతున్నది. క్రిస్పు, క్రీస్తునంగీకరింపక మునుపు కొరింథులోని యూదుల సమాజమందిరపు అధికారియై యుండెను (అపొ. 18:8). సమాజంలో వీరికుండిన ఉన్నతమైన స్థాయినిబట్టి పౌలు వీరికి తానే వ్యక్తిగతంగా బాప్తిస్మమిచ్చియుండును. వీరి బాప్తిస్మములు సంఘానికి ప్రత్యేకమైన సందర్భాలై యుంటాయి. Gerd Theissen ఇలా వ్రాస్తున్నాడు, "దీనినిబట్టి చూస్తే, సమాజంలో పలుకుబడిగలవారు మరియు ప్రముఖులైన కొద్దిమందికి మాత్రమే బాప్తిస్మమియ్యడాని పౌలు తనను తాను పరిమితం చేసుకొన్నాడని అర్థమవుతున్నది."[5] సంఘంలో ఏర్పడిన విభజనలకును, సమాజంలో ఉన్నతమైన మరియు నిమ్నమైన స్థాయిలలో ఉన్న వారికిని మధ్య ఉండిన ఉద్రిక్తతకును సంబంధం ఉన్నదని తెలుస్తున్నది (1 కొరింథీ. 11:20-22 చూడండి).

సంఘము లోలోపలే అతనిని విమర్శించు చుండినవారు ఉండిరని చెప్పుకోడానికి పౌలు ప్రదర్శించుచున్న సమర్థించు కొను పైఖరి ఒక సంకేతమై యున్నది. ఎవరైనా

ఒకరు పౌలు పేరట బాప్తిస్మము పొందారని సాధికారంతో చెప్పుకొన్నప్పటికిని, అది తనకు ఎరుక లేకుండానే లేదా అతడు తన ఆమోదము తెలుపకుండానే జరిగిన విషయమని అందరు తెలుసుకొనవలెనని అపొస్తలుడు ఆశించాడు. తాను బాప్తిస్మమిచ్చిన కొరింథీ క్రైస్తవులలో ఏ ఒక్కరైనను వారు అతని **నామములో బాప్తిస్మమి**య్యబడ్డారని సాధికారంతో చెప్పలేరని పౌలు దృఢనిశ్చయతతో చెప్పగలిగి యుండెను.

**వచనము 16.** తన సొంత చేతులతో క్రిస్పునకు మరియు గాయియునకు మాత్రమే బాప్తిస్మమిచ్చాడను ఇంతకు మునుపటి తన సాధికార భావాలను మార్చుకొనడానికి అపొస్తలుడు నిదానించాడు. అతడు **స్తెఫను** [Stephanas] **ఇంటివారికిని** బాప్తిస్మమిచ్చిన విషయాన్ని జ్ఞాపకం చేసుకొన్నాడు - ఈ క్రైస్తవుని పేరు అపొస్తలుల కార్యముల పుస్తకంలోగాని లేదా రోమా. 16వ అధ్యాయంలోగాని పేర్కొనబడలేదు. “ఇంటివారు” అనే పదము, ఇక్కడైనా లేదా అపొ. 16:15, 34లో అయినా, పెద్దలతోపాటు చిన్న పిల్లలు కూడ బాప్తిస్మమియ్యబడినదని సూచించదు. బాప్తిస్మమునకు ఎవరు యోగ్యులని “ఇంటివారు” అనే ప్రస్తావనను ఆధారం చేసుకొని నిర్ణయించడం కంటె, ఇతరమైన ఆధారమును పరిగణలోనికి తీసుకొనడం యుక్తము.

స్తెఫను (Stephanas), క్రిస్పు మరియు గాయియుతోపాటు, కొరింథు సంఘంలో ఒక ప్రముఖుడై యుండవచ్చు. స్తెఫను (Stephanas), తన ద్వారా కొరింథులో క్రీస్తునంగీకరించిన మొదటి వ్యక్తులలో ఒకడై యుండెననియు, గనుక ఆత్మసంబంధమైన నాయకత్వం విషయంలో వారు స్తెఫను (Stephanas) వంటి వ్యక్తుల కొరకు వెదకుచుండవలెననియు పౌలు అటుతరువాత కొరింథీయులకు జ్ఞాపకం చేశాడు (16:15, 16). ఇతరులతో కూడ ఈ స్తెఫను, కొరింథీ సంఘం వ్రాసిన ఒక ఉత్తరముతో ఎఫెస్సు పట్టణానికి పయనించినట్లు కనబడుతున్నది (7:1ఎ; 16:17). ఈ స్తెఫనుతో కూడ వెళ్లిన ఇరువురు ఎక్కువగా బానిసలకు పెట్టబడుచుండిన పేర్లు గలవారై యున్నారు. “ఫొర్మునాతు” (“Fortunatus”) అనగా, “అదృష్టవంతుడు” అని అర్థమిస్తుంది. “అకాయికు” (“Achaicus”) ఒక జాతివాచక నామధేయమై యుండి, అతడు అకయ వాస్తవ్యుడై యుండెనని గుర్తించుచున్నది, మరియు అకయ రాష్ట్రమును ఏలుటకు కొరింథు ముఖ్యపట్టణమై యుండినది. వారి గూర్చి పౌలుతో సంప్రదించడానికి ఈ స్తెఫను కొరింథు నుండి ఎఫెస్సు పట్టణానికి పయనమై వెళ్లుచుండిన తరుణంలో తనతో కూడ ఇద్దరు బానిసలను తీసికొని వెళ్లియుంటాడు. ప్రయాణాల్లో ప్రమాదాలు లేదా ప్రమాదకరమైన పరిస్థితులు ఎల్లప్పుడు ఎదురవుతాయి. గనుక ఒక్కడు ఒంటరిగా పయనించడం కంటె ముగ్గురు కలిసి వెళ్లడం యింకా క్షేమకరం.

తాను ఈ స్తెఫనుకు బాప్తిస్మమిచ్చాడని అంగీకరించిన మీదట, తాను మర్చిపోయిన యితర విషయాల గూర్చి అతనిని ఇబ్బంది పెట్టవద్దని వారి చనువు కోసం వారిని బ్రతిమలాడుచు పౌలు తనను తాను కాపాడుకొన్నాడు. **వీరికి తప్ప మరి ఎవరికైనను బాప్తిస్మమిచ్చితినేమో నేనెరుగను** అని అపొస్తలుడు ఒప్పుకొన్నాడు. తాను వారిని మోసం చేయాలని పౌలు ఉద్దేశించలేదు. తాను వ్యక్తిగతంగా ఇతరులకు బాప్తిస్మమిచ్చియుండినప్పటికిని వారి పేర్లు చెప్పలేకపోతున్నాడంటే, జ్ఞాపకశక్తి లోపమే

ఇందుకు కారణం. పరిశుద్ధాత్మ, మాటలు చెప్పుతూ వ్రాయించడం కంటె, పరిశుద్ధాత్మ ప్రేరేపణ ఎక్కువ ముఖ్యమని పౌలు మాటలు మనకు జ్ఞాపకం చేస్తున్నాయి. పౌలు ఎంత మందికి బాప్తిస్మమిచ్చాడో పరిశుద్ధాత్మకు తెలియును; కాని పౌలుకు తెలియలేదు.

## "ధ్యాస అంతా క్రీస్తు సిలువ మీద కేంద్రీకరింపబడినది" (1:17)

**[17]బాప్తిస్మమిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదు గాని, క్రీస్తు యొక్క సిలువ వ్యర్థము కాకుండునట్లు, వాక్చాతుర్యము లేకుండ సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను.**

**వచనము 17. సువార్త ప్రకటించడానికి** ప్రభువు అతనిని పంపాడు కాబట్టి పౌలు కొందరు కొరింథీయులకు తన స్వహస్తములతో బాప్తిస్మమిచ్చుటకుగల కారణమై యున్నది. పౌలు బోధించిన విధానము మరియు సంబంధిత విశిష్ట విషయము, ప్రభువు యొక్క ప్రత్యక్షతపై ఆధారపడినవి. క్రీస్తు అపొస్తలుని అధికారము పౌలు కొరింథు పట్టణంలో బోధించిన విషయాలకు ఆలంబనమిచ్చినది. బాప్తిస్మమనేది, భౌతికంగా క్రీస్తును ఒప్పు కొనుటయైయున్నది; ఎవరి చేతులు బాప్తిస్మమిచ్చు చున్నవనేది అక్కరలేని అంశం. అవసరమైనదెల్లా, ముఖ్యమైనదెల్లా, ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు వాని పాపముల విమోచనార్థం ప్రభువు చేసే కార్యమే. బాప్తిస్మము, ఇష్టముంటే తీసుకొనవచ్చు, ఇష్టం లేనట్లయితే తీసుకోనవసరము లేదనే విషయమని పౌలు మాటలు అర్థమీయడం లేదు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందడమనగా, ఆయనతో కూడ పాతిపెట్టబడి ఆయనతో కూడ లేచుటయై యున్నది (రోమా. 6:4; కొలొస్స. 2:12). బాప్తిస్మము ప్రక్రియలో, గొఱ్ఱెపిల్ల రక్తము సమకూర్చు విమోచనములోని విశ్వాసమునుబట్టి క్రీస్తునంగీ కరించినవారు కడుగబడి పరిశుద్ధపరచ బడుదురు (1 కొరింథీ. 6:11).

పౌలు తన సొంత బోధను, **క్రీస్తు యొక్క సిలువను** రద్దుచేసిన ఒక విధమైన జ్ఞానముతో పోల్చాడు, సంస్కృతిపరంగా నిర్వచింపబడిన జ్ఞానమునకు కొరింథీయులు ఇచ్చుచుండిన విలువతో సంఘంలో ఏర్పడిన విభజనలు గొప్ప సంబంధంగలవై ఉన్నాయని స్పష్టం చేశాడు. పౌలు బోధలు, కొరింథులోను మరియు ఆనాటి ఇతర గ్రీకు పట్టణాలలోను కనబడుచు, ఆ యా చోట్లకు వెళ్లి బోధలు చేయుచుండిన సంచాలక బోధకుల బోధల వంటివి కావు. పౌలు తన పాండిత్యముతోగాని లేదా వాగ్ధాటితోగాని ఇతరులను ప్రభావితము చేయవలెనని ఎన్నడును ప్రయత్నించలేదు. అతని సందేశం దివ్యమైన సందేశమై యుండింది. మానవ ప్రయాసముపై ఆధారపడుతున్నామంటే, క్రీస్తు సిలువను నిరర్థకం చేస్తున్నట్టే. పౌలు తాను బోధించుచుండిన బోధలలో మాత్రమే కాదు, గాని అతడు ఆ బోధలను బోధించుచుండిన విధానములో సహితం క్రీస్తును సంతోష పెట్టాలని ఆశించాడు.

కొరింథీయులు ఉపదేశములోను జ్ఞానములోను క్రీస్తును గూర్చిన సాక్ష్యములో పాలుపొందుట ద్వారా ఐశ్వర్యవంతులయ్యారని పౌలు అదివరకే వారికి అభయమిచ్చాడు (1:5, 6); కాని కొందరు విశ్వాసులు మరి ఎక్కువ ఐశ్వర్యం కొరకు ఆశించారు.

కొరింథులోని ఒక మూలసూత్రము, గ్రీకులు రోమనులు ఏలుచుండిన ప్రపంచంలో పాండిత్యమునకు ప్రతీకగా నిలిచిన వాక్పటిమ మరియు తత్త్వశాస్త్రముతో మరులుగొల్పబడినదయ్యింది (3:18-20). ఆనాటి వాక్పటిమగల వక్తలు పౌలునకు తెలియును, కాని అతడు **వాక్చాతుర్యముగలవాడై రాలేదు**. పౌలు వారితో మాటలాడిన విషయాలుగాని లేదా వారికి వ్రాయుచుండిన విషయాలుగాని వాటి కార్యసార్థకము విషయంలో వాటికి ప్రామాణికమైన పరిమాణములు గుర్తుపెట్టబడలేదు. సంఘము గూర్చి ప్రజలకుండిన దృక్పథము కంటె, సంఘము దాని విశిష్ట విషయములో (సారభూతములో) ఏమై యుండినదో ఎక్కువ ప్రాముఖ్యమైనదై యుండెను. అపొస్తలుని దృష్టిలో విద్యావంతుడుగా అతనికుండిన పేరుప్రఖ్యాతుల కంటె, "క్రీస్తు సిలువ" ఎక్కువ ముఖ్యమై యుండింది. పౌలు దృష్టిలో, వాక్చాతుర్యము వెంటబడుట సిలువ మీద ప్రదర్శింపబడిన దేవుని కృపను **నిరర్థకము** చేయడమవుతుంది.

## దేవుని జ్ఞానము (1:18-31)

కొరింథు మరియు ఇతర గ్రీకు పట్టణములలోని మతపరమైన వాతావరణము వాక్చాతుర్యముతో కూడిన ఉపదేశములను మరియు ఆడంబరపూర్వకమైన మానసిక దృష్టికోణమును పొగడుటకు చాలా అనుకూలంగా ఉండింది. పౌలు మాటల్లో ఏదియు నిర్దిష్టమైన ముద్రగల డాంబికమైన పాండిత్యమును సూచించడం లేదు. సంఘంలో నెలకొన్న విభజించే స్ఫూర్తి ఇతరులపై పెత్తనం చెలాయించడానికి తమంతట తామే పూనుకొనిన కొందరు క్రైస్తవుల పరువునకు మద్దతిచ్చిన ఇష్టాయిష్టాలు మరియు విశ్వాసపాత్రముల ఫలితమై యుండింది. సంఘం అధికారము మరియు పలుకుబడికి సంబంధించిన ప్రాపంచిక ప్రమాణములను అవలంబించుచుండింది. తనకు ఎదురైన ఆశాభంగంతో పోరాడుచు, లోకము చేత నిర్వచింపబడిన అధికారము మరియు జ్ఞానమునకు యేసే క్రీస్తని ఒప్పుకొనువారి సామాజిక జీవితంలో పాలు లేదని తన పాఠకులను ఒప్పించడానికి పౌలు ప్రారంభించాడు. వారు సేవించుచుండిన ప్రభువు సిలువవేయబడ్డాడు. దేవుడు లోకము చేత తృణీకరింపబడిన విషయాలను ఏర్పాటుచేసుకొన్నాడు. కొరింథులోని క్రైస్తవులు తమ చిత్తవృత్తిలో సమస్యను ఎదుర్కొనుచుండిరి; వారు క్రీస్తు స్ఫూర్తిని స్వాయత్తం చేసుకొనునంతగా వారి ప్రవర్తన మారవలసి యుండింది.

### సిలువ సందేశం యొక్క "వెఱ్ఱితనము" (1:18-25)

**18సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి. 19ఇందు విషయమై**

**జ్ఞానుల జ్ఞానమును నాశనము చేతును. వివేకుల వివేకమును శూన్యపరతును అని వ్రాయబడి యున్నది.**

**20జ్ఞాని యేమయ్యెను? శాస్త్రి యేమయ్యెను. ఈ లోకపు తర్కివాది యేమయ్యెను?**

**ఈలోక జ్ఞానమును దేవుడు వెఱ్ఱితనముగా చేసియున్నాడు గదా? [21]దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండినందున, సువార్త ప్రకటనయను వెఱ్ఱితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. [22]యూదులు సూచక క్రియలు చేయుమని అడుగుచున్నారు, గ్రీసు దేశస్థులు జ్ఞానము వెదకుచున్నారు. [23]అయితే మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. [24]ఆయన యూదులకు ఆటంకముగాను అన్యజనులకు వెఱ్ఱితనముగాను ఉన్నాడు; గాని యూదులకేమి, గ్రీసుదేశస్థులకేమి, పిలువబడినవారికే క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునై యున్నాడు. [25]దేవుని వెఱ్ఱితనము మనుష్య జ్ఞానము కంటె జ్ఞానముగలది, దేవుని బలహీనత మనుష్యుల బలము కంటె బలమైనది.**

**వచనము 18.** పౌలు రెండుగుంపులకు చెందినవారిని పోల్చు తున్నాడు: **నశించుచున్న వారికి** మరియు **రక్షింపబడుచున్న మనకు.** కొనసాగుచున్న ప్రక్రియ వైపు మన సావధానమును వర్తమానకాలమును సూచించు కాలమును పౌలు ప్రయోగిస్తున్నాడు. పౌలు సూచిస్తున్న తారతమ్యము రక్షింపబడినవారికిని నశించిన వారికిని మధ్య నున్నది కాదు, గాని నశించుచుండిన వారికిని రక్షింపబడుచుండిన వారికిని మధ్య గల తారతమ్యమును సూచిస్తున్నాడు. పౌలు దృష్టిలో, క్రీస్తునందుండుట అనేది "ఇప్పటికీ, ఎప్పటికీ, అయితే ఒక్కసారే" అని నిర్వచింపబడు క్షణం కాదు; అది తెర వెనుక నుండిన సన్నివేషం ఒకటకటిగా తెర ముందుకు వచ్చి తేటతెల్లముగా కనబడుచుండిన, ఈ లోక జీవితము యొక్క సన్నివేషమై యుండింది, ఇందులో, నిర్ణయం తీసుకొనబడిన మరుక్షణంలోనే తదనంతర నిర్ణయం తానే వరుసగా వచ్చుచుండును.

సిలువవేయబడిన రక్షకుని గూర్చిన అభిప్రాయం మొత్తం వెఱ్ఱితనముగా నున్న దృష్టికోణంగలవారు, "నశించుచున్నవారుగా" గుర్తింపబడ్డారు. సిలువ సందేశం మానవుల దృష్టిలో **వెఱ్ఱితనము**గాను అడ్డుతగులుతున్న ఆటంకముగాను ఉన్నది. లోకము, దేనినైతే జ్ఞానమని ఎంచుచున్నదో దానిలోనే వెఱ్ఱితనమున్నది: కేవలము మానవులైనవారికి, సిలువవేయబడి నేరస్థునికి సంబంధించిన సందేశం విషయంలో ఏదియు తెలివితేటలతో కూడినదిగా లేక తత్త్వశాస్త్రానుగుణమైనదిగా కనిపించడం లేదు.[6] క్రైస్తవ ఒప్పుకోలుకు సంబంధించిన ఆరంభ అంశం (15:3), ఆడంబరపూర్వకమైన పాండిత్యము గూర్చిన జ్ఞాని యొక్క అభిప్రాయమును తీవ్రంగా వ్యతిరేకించింది.

సిలువ దృశ్యం దేవుని **శక్తిని** ప్రదర్శించుచున్నదనే నమ్మకం, "రక్షింపబడుచున్న మనకు" గురుతై యున్నది. దేవుడు నజరేతువాడైన యేసును సిలువకు అప్పగించుట ద్వారా సమస్త మానవాళిని విమోచించినప్పుడు, శక్తి, చాతుర్యము, లోకము యొక్క జ్ఞానము గూర్చిన భావములు తలకిందులు చేయబడినవి. క్రైస్తవ సమాజము సిలువ చేత రూపుదిద్దుకొన్నది. తన పాఠకులు అర్థంచేసుకోవాలని అపొస్తలుడు ఎంతో సాహసించాడు. పరువు ప్రతిష్ఠ కోసం మానవులు ప్రదర్శించు విశ్వాసపాత్రములు మరియు ప్రయాసపడు పోటీలపై కట్టబడి విభజనలను ప్రోత్సహించు ప్రవర్తన, సిలువను

అర్థంచేసుకొనుటలో కొరింథీయుల వైఫల్యమును ప్రదర్శించింది. ఈ వక్రోక్తిని గమనించడంలో వారెలా విఫలులయ్యారు? సిలువ మీద ఎటువంటి వ్యక్తులు మరణించారో అపొస్తలుడు వివరించాల్సిన అవసరం లేకుండింది. నిస్సహాయులైనవారు, వెలివేయబడినవారు, దుర్మార్గులు సిలువవేయబడ్డారు - అధిపతులు కాదు, రాజులు కాదు, రక్షకులు కాదు. ఏదేమైనప్పటికిని, "రక్షింపబడుచున్న మనకు" దేవుని శక్తి సిలువలో ఉన్నది.

**వచనము 19.** సిలువ, మానవ శక్తి మరియు ఏలుబడికి సంబంధించిన ప్రతి ప్రమాణాన్ని సవాలు చేస్తూ, లోకమునకు సమగ్రమైన నవీనత్వమును అనుగ్రహించింది. సిలువ, దేవుని ప్రత్యక్షత నుండి ఎన్నడును పెడదారి పట్టని ఒక ఇతివృత్తము యొక్క కొనసాగింపై యున్నదని యూదు లేఖనములను పఠించుచుండిన విచక్షణాసహితుడైన పాఠకుడు గుర్తించగలిగాడు. షీనారు మైదానములో నివసించిన ప్రాచీన ప్రజల గూర్చిన కథ నశించుచున్నవారిని సూచించుటకు బహు చక్కని ఉదాహరణమై యున్నది (ఆది. 11:1-9). మానవులు అవి ఎప్పటికీ నిలిచియుండాలను ఆతురతతో వారి గోపురములను నిర్మించుకొన్నారు, కాని వారి భాషలను ఎప్పటికీ తారుమారు చేయడానికి దేవుడు దిగివచ్చాడు. హన్నా (1 సమూ. 2:1-10) మొదలుకొని మరియ (లూకా 1:46-55) వరకు, అక్కరలలో ఉన్నవారిని దేవుడు బూడిద కుప్పలో నుండి పైకెత్తుచునే యున్నాడు. ఆయన యెషయా ద్వారా, **జ్ఞానుల జ్ఞానము నాశనము చేతును** అని చెప్పుచుండినప్పుడు క్రొత్త విషయమేమీ చెప్పలేదు (యెషయా 29:14 చూడుము).[7] వాక్చాతుర్యముతో మాటలాడుట మరియు ఆడంబరపూర్వకమైన పాండిత్యము యొక్క శక్తితో మరులుగొల్పబడినవారి గూర్చిన సవిమర్శక పరిశీలన నిమిత్తం కొరింథు క్రైస్తవులు సిలువను మరియు దేవుని ప్రత్యక్షతను చూచుట యుక్తమని పౌలు సెలవిచ్చాడు.

**వచనము 20.** పౌలు అడిగిన ప్రశ్నలు, వారి పాండిత్యమునుబట్టి లోకం చేత పొగడబడిన ఎవరినైనను కొరింథు క్రైస్తవులు చేర్చుకొనలేదనే ధ్వనింపునిచ్చుచున్నవి. **జ్ఞాని యేమయ్యెను?** అనే ప్రశ్న, వారి రక్షణకు లోక జ్ఞానం మూలాధారం కాదనే సత్యమును వారికి జ్ఞాపకం చేయడానికి మర్యాదపూర్వకమైన విధానమై యుండింది. అపొస్తలుడు జ్ఞానమును నిరపేక్షమైన అవగాహనతో తృణీకరించలేదు. దానికి బదులుగా, లోక జ్ఞానము కంటె, దేవుడనుగ్రహించు జ్ఞానము భిన్నమైన శ్రేణికి చెందినదని అతడు కొనసాగాడు (2:6). యేసు ఇదే విషయాన్ని ఇలా తెలియజెప్పాడు, "తండ్రీ, ఆకాశమునకును భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును వివేకులకు ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను" (లూకా 10:21).

గ్రీకులు మరియు రోమనుల దృష్టిలో, ఏదైన ఒక వ్యాఖ్యమును, వాగ్రూపంలో గాని లేదా లిఖితరూపంలో గాని చాతుర్యముతో వాదించుట జ్ఞానమునకు మరియు పాండిత్యమునకు మంచి సారసంగ్రహమై యుండింది. కొరింథు సంఘం ఇటువంటివారు వారి పరిసర ప్రాంతాల్లో ఎందరున్నారో తెలుసుకొని, **శాస్త్రి యేమయ్యెను? ఈ లోకపు తర్కవాది యేమయ్యెను?** అని ప్రశ్నించవలెనని పౌలు ఆశించాడు. లోకరీతిగా

చాతుర్యముగలవారికి క్రీస్తు కొరకు సమయం లేదు. పౌలు కొరింథీయులను ఇలా ప్రశ్నిస్తున్నాడు: "లోకములోని అధునాతనమైన ఆడంబరముతో కూడిన ఇటువంటి మీ ప్రశంసలకు మూలాధారం ఏమైయున్నది?" దేవుడు క్రైస్తవులకు దీవెలనిచ్చినప్పుడు, **ఆయన ఈ లోక జ్ఞానమును వెఱ్ఱితనముగా** చేశాడు.

పౌలు మనస్సులో నిర్దిష్టమైన ప్రజా వర్గములు ఉండియుండక పోవచ్చు: కొందరు "జ్ఞానులు," కొందరు "శాస్త్రులు," కొందరు "తర్కవాదులు." పౌలు 20వ వచనములోని పదజాలములను తరుచుగా లోకము యొక్క విలువలు మరియు ఆదర్శములతోపాటు వచ్చు సాధారణ హోదాలుగా భావించియుండవచ్చు. బహుశా అతడు తార్సు మరియు యెరూషలేములో అభ్యసించిన తన సొంత విద్యాభ్యాసం గూర్చి మననం చేసుకొనుచుండవచ్చు. జ్ఞానము పట్ల అతనికి అనాదరణ లేదు. యథార్థమైన విద్య క్రీస్తు కొరకు ప్రయోజనపడుతుంది; కాని అది కొరింథులో నెలకొని యుండిన జ్ఞానము విషయంలో అంగీకరింపబడుటకు ఉన్ముఖమైయుండి స్వప్రయోజనమునకు ప్రయోజనపడు లక్షణాలను వర్ధిల్లజేయలేదు.

**వచనము 21.** సాధ్యమైనంత తీవ్రంగా, సంతజరిగే చోటులోని కుతర్కవాదులు మరియు విద్వాంసులైన తత్త్వశాస్త్రవేత్తల **జ్ఞానమును** పౌలు బోధించుచుండగా క్రైస్తవులు వినిన సువార్త యొక్క **వెఱ్ఱి**తనముతో పౌలు పోల్చుతున్నాడు. మానవజాతి, అనగా, **లోకము** (κόσμος, *kosmos*), దాని సొంతతంత్రములకు విడువబడినందువలన స్వాభావికమైన దృగ్విష యములో దేవుని యొక్క మిణుకుమిణుకుమను కాంతికి మాత్రమే చేరువగా ఉండిందని అతడు గమనించాడు (రోమా. 1:20). దేవుని గూర్చి స్వాభావికమైన లోకం మానవాళికి ఏ యే పరిజ్ఞానములను బోధించినదో వాటినన్నిటిని పాపము కలుషితము చేసినది. గనుక మానవులు తమంత తామే వారి సొంత దేవుళ్లు కావలెనను తపనతో, వారి అహంకారము మరియు సుఖానుభవముపైనే ఎక్కువగా ఉండిన ప్రేమ వారిని అనుమతించిన దాని కంటె ఎక్కువ ఉన్నత స్థాయికి చేరుకొనలేకపోయారు. "తాము జ్ఞానులమని చెప్పుకొనుచు, బుద్ధిహీనులైరి" (రోమా. 1:22).

**దేవుని ఎరుగుటకు** ప్రాప్తియైన మానవాళి విఫలమగుటయే **దేవుని జ్ఞానమునకు** ఒక సంకేతమై యుండింది. అట్లయినప్పటికిని, దురహంకారులు మరియు ఇంద్రియసుఖాసక్తుల యెడల దేవుడు తన తృణీకారమును చూపలేదు. దానికి బదులుగా, ప్రేమతో కూడిన నిస్వార్థమైన మరియు వివరింపబడలేని చర్య ఆయన తన కుమారుడు బలహీనతనుబట్టి మరణించునట్లు పంపడానికి హేతువయ్యింది. ఆయన కుమారుని మరణంలో, సమాధానపరచబడుటకు ద్వారమును తెరిచాడు. పౌలు ప్రకటించిన **సువార్త** ద్వారా విశ్వసించినవారు రక్షింపబడ్డారు, అట్లయినను సిలువవేయబడిన దేవునిలో లోకము జ్ఞానమును కనుగొనలేకపోయింది. లౌకిక జ్ఞానము దేవుళ్లను, అద్దములో కనబడు తిరగేసిన ప్రతిబింబముగా చేస్తుంది. ఇదే సత్యము అని సాధికారంతో చెప్పగల దేవుని గూర్చిన ఒకే ఒక్క జ్ఞానము, దేవుని స్వయం ప్రత్యక్షత యొక్క ఫలితమై యున్నది. దేవుని తెలుసుకొనుట అనగా, ఒకడు మార్గనిర్దేశనము కొరకు ఆయన మీద ఆనుకొంటూ, తన నైతిక మరియు సదాచార

వైఖరులు తానేమై యున్నాడో తనను తాను ప్రత్యక్షపరచుకొనిన దేవునితో సామరస్యంగలవై యుండునట్లు తన ప్రవర్తనను సంబంధిత సమరేఖలో ఉంచుకొనుటయై యున్నది.

**వచనము 22.** సిలువవేయబడిన రక్షకుని గూర్చి బోధించుటలోగల వెఱ్ఱితనము పట్ల మానవాళి ప్రదర్శించిన ప్రతిస్పందనను పౌలు రెండు వర్గములుగా విభజించాడు: యూదులు మరియు గ్రీకులు. సహజంగానే, పౌలు అందరికీ అన్వయించాడు. ప్రతి యూదుడుగాని మరియు ప్రతి గ్రీకు దేశస్థుడుగాని ఒకే విధంగా ప్రతిస్పందించలేదు; కాని నిర్దిష్ట ప్రజా గుంపునకు చెందినవారు తమ సొంత సాంప్రదాయాలు, తమ సొంత మేధాశక్తిపై ఆధారపడ్డారు గనుక దేవుని జ్ఞానమును బుద్ధిపూర్వకంగా త్యజించారు. **యూదులు** వారు వినుచుండిన సత్యమును నిదర్శనములతో నిరూపించు పరలోక **సూచక క్రియల చేయమని అడుగుచున్నారు.** యేసు వీరి ప్రశ్నలను ఎదుర్కొన్నాడు. యేసు గలిలయ ప్రాంతంలో చేసిన పరిచర్య గూర్చి పౌలునకు ఎంత మేరకు తెలుసుననేది ప్రశ్నార్థకమైన విషయం, కాని యేసు మరియు యూదుల మతపరమైన నాయకులు తటస్థపడిన విషయాల గూర్చిన నివేదికలు అపొస్తలుడు వినియుంటాడు. "బోధకుడా, నీ వలన ఒక సూచక క్రియ చూడగోరుచున్నాము" అని చెప్పిరి (మత్తయి 12:38). "అట్లయితే మేము చూచి నిన్ను విశ్వసించుటకు నీవు ఏ సూచక క్రియ చేయుచున్నావు, ఏమి జరిగించుచున్నావు?" (యోహాను 6:30).

యూదులు ఒక సూచక క్రియ కొరకు అడుగుటలో గల నిందాస్తుతి ఏమంటే, యేసు చేయుచుండిన పరిచర్య అనేక సూచక క్రియలతో కూడినదై యుండింది. యూదులు యెషయా ప్రవక్త పలికిన ప్రవచనమును నెరవేర్చారు: "వారు చూచుటకైతే చూచియు కనుగొనకయు, వినుటకైతే వినియు గ్రహింపకయు . . ." (మార్కు 4:12; యెషయా 6:9, 10 చూడుము). సూచక క్రియలు యేసు చేసిన కార్యముల వరకే పరిమితమై యుండలేదు. అపొస్తలుడు కొరింథీయులకు అటుతరువాత ఇలా వ్రాశాడు: "సూచక క్రియలను అద్భుతములను మహత్కార్యములను చేయుట వలన, అపొస్తలుని యొక్క చిహ్నములు పూర్ణమైన ఓరిమితో మీమధ్యను నిజముగా కనుపరచబడెను" (2 కొరింథీ. 12:12). సూచక క్రియ కొరకు అడుగుచు, ఏ సూచక క్రియయైనను వారికి తృప్తినీయనప్పటికిని, "సువార్త ప్రకటన యను వెఱ్ఱితనమునకు" యూదులు తరుచుగా ప్రతిస్పందించారు (1 కొరింథీ. 1:21).

సిలువవేయబడిన రక్షకుని గూర్చిన సనవర్తమానము పట్ల **గ్రీసు దేశస్థులు** ప్రదర్శించిన ప్రతిస్పందన, అసలు విషయమంతా అర్థం కాకపోయినా, "మాకు తెలుసు" అనే చిరునవ్వు చిందించుట వలె ఉండింది; **జ్ఞానమును** ప్రాప్తించుకొను వారు చేసే ప్రయత్నాల విషయంలో వారు ప్రసిద్ధికెక్కినవారై యుండిరి. ఆదిమ క్రైస్తవ యుగమునాటి గ్రీకు ఆలోచనాపరులలో తత్త్వశాస్త్రమునకు సంబంధించిన ఊహాగానం విస్తృతంగా వర్తించునదై యుండినది. వారికైతే, జ్ఞానము జ్ఞానులైనవారు వేరుగా కూడుకొని మరలా మరలా ఆలోచించుచుండిన చోట్లకు నెట్టివేయబడలేదు. వీధుల వెంబడి బోధించుచుండినవారిలో అజ్ఞానులు మొదలుకొని అధునాతనమైన లోకజ్ఞానముగలవారై యుండిరి. అడపాదడపా పరిశీలనగా గమనించుచుండినవారు

విచక్షణశీలమైన విమర్శకులయ్యారు. పట్టణములోనికి ప్రవేశించిన అత్యంత అధునాతన తత్త్వశాస్త్రవేత్త యొక్క అర్హతల గూర్చి చెప్పులు కుట్టేవారు మరియు చర్మకారులు వాదోపవాదములు చేయుచుండిరి. గ్రీసు దేశస్థులలో అనేకుల దృష్టికి పౌలు ఇటీవలనే పరిచయమైన బోధకుడై యుండెను. వారు కుతంత్రముతో కూడిన వాక్చాతుర్యము, తెలివితేటలుగల అలంకారయుక్తమైన సాహిత్యముతో కూడిన కదలికలు, ఇంతవరకు తెలియని వినూత్నమైన వివరముల కొరకు వెదకుచుండిరి. సిలువవేయబడి, చనిపోయి, పాతిపెట్టబడి మరలా లేచిన రక్షకుని మూలమున దేవుని ఎరుగుటకు మరియు పరివర్తనా జీవితమునకు అవకాశం కలుగజేయు జ్ఞానము కొరకైన గ్రీసు దేశస్థుల అన్వేషణను **(వెదుకుట)** అధిగమించినదై యుండింది.

**వచనము 23.** ఎటువంటి సంకోచమైనను లేకుండానే, "మేము" అనే ఉద్ఘాటనతో కూడిన పదమును ఉపయోగిస్తూ, యూదులు అడుగుచుండిన సూచక క్రియ మరియు గ్రీస్తు దేశస్థులు జ్ఞానము పట్ల ప్రదర్శించిన తీవ్రమైన తాత్కాలిక ఆసక్తి విషయమై పౌలు కొరింథీయులకు ఒక ప్రత్యామ్నాయమును ప్రతిపాదించాడు: **మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము.** దేవుని చేత అభిషేకింపబడినవాని గూర్చి యూదులకుండిన ఆశలను తృప్తిపరచు నిమిత్తము అతడు ఏ సూచక క్రియనైనను ప్రతిపాదించలేదు; అన్యజనులై యుండిన జ్ఞానుల జిజ్ఞాసను పురికొల్పుటకు ఏ జ్ఞానమునైనను అతడు వారి ముందుంచలేదు. సత్యమనేది, ఏ మానవుడైనను ఎదురుచూడని దిశలో ఉన్నది. సిలువలో దేవుని జ్ఞానము గూర్చిన కడాపటి నిందాస్తుతి మరియు అంతిమ అభివ్యక్తీకరణముండినవి: "బలహీనతనుబట్టి ఆయన సిలువవేయబడెను గాని, దేవుని శక్తినిబట్టి జీవించుచున్నాడు" (2 కొరింథీ. 13:4ఎ).

Leon Morris ఇలా చెప్పుతున్నాడు, "సిలువలోని శక్తి అత్యంత వినయమనస్కులైన వారు దేవుని తెలుసుకొని చెడును జయించుటకు వారికి మార్గమును సరాళము చేయుచున్నది, సరికదా, తత్త్వశాస్త్రవేత్తలు పుట్టించగల దేని విషయములోనైనను అత్యంత అతీతమైన జ్ఞానము అదే."[8] ఇలా సెలవిస్తున్నాడు, "మానవాళి తనను తాను అధిగమించలేకపోయిన అసమర్థతను దాని అత్యంత కఠోరమైన రూపంలో చిత్రీకరించడానికి క్రీస్తు మరణము గూర్చిన పౌలు గ్రహింపునకు సిలువ సంకేతం ప్రధానమయ్యింది."[9]

"ఇదిగో, లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని పలుకుతూ, బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తును పరిచయం చేశాడు (యోహాను 1:29). దశాబ్దాల తరువాత, అపొస్తలుడైన యోహాను తెల్లని గుఱ్ఱము మీద కూర్చుండి యున్నవానిని దర్శనములో చూశాడు. ". . . అతనికి ఒక కిరీటమియ్యబడెను; అతడు జయించుచు, జయించుటకు బయలువెళ్లెను" అని యోహాను తాను చూచినవాని గూర్చి చెప్పాడు (ప్రకటన 6:2). సిలువవేయబడిన క్రీస్తు రాజ్యమునేలుచుండిన రక్షకుడయ్యాడు. యూదుల ఆశలను దేవుని శక్తి రద్దుచేసింది; ఆయన జ్ఞానము సిలువను గూర్చిన అన్యజనుల విలువను వెఱ్ఱితనముగా తబ్బిబ్బు చేసినది. బలహీనతలోగల బలము మరియు వెఱ్ఱితనములోగల జ్ఞానము గూర్చిన అసమ్మతార్థము అపొస్తలునికి మార్గదర్శకము నిచ్చుచుండిన నక్షత్రమయ్యింది. "అతిశయపడవలసి యుంటే, నేను

నా బలహీనత విషయమైన సంగతులను గూర్చియే అతిశయపడుదును" అనియు (2 కొరింథీ. 11:30), "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" అనియు (2 కొరింథీ. 12:10) అతడు అటుతరువాత రచించాడు.

**వచనము 24.** మానవులు తమ ఆశల ప్రకారం (సూచక క్రియలు మరియు తత్త్వశాస్త్రమునకు సంబంధించిన ఊహాగానం) దేవునిని నిర్వచించిన విధానమును, దేవుడు మానవాళిని రక్షించుటకు చేపట్టవలెనని చొరవ తీసుకోడానికి ఆయన కొరకు వేచియుండిన విధానముతో పోల్చడమును అపొస్తలుడు కొనసాగించాడు. క్రైస్తవ ఉపదేశము దేవుని గూర్చిన అమూర్తమైన లేక గూఢమైన మానసిక చింతన మీద ఆధారపడదు; అది దేవుడు చేసిన కార్యమును గూర్చిన ఒక ప్రకటనయై యున్నది. అందరికి కాదు, కాని **పిలువబడిన వారికే**, సిలువ వేయబడిన **క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునై యున్నాడు.** క్రైస్తవులు "పిలువబడినవారై" యుండుట, దేవుని చొరవ వలననే అను సత్యము దిశగా మన మనస్సును మళ్లిస్తున్నది; దేవుని పిలుపునకు మానవుడు నిశ్చయాత్మకంగా స్పందించాల్సి వున్నదను అవసరతను ఇది తొలగించదు.

పౌలు బోధించుచుండిన ఉపదేశాలు ఏదో తత్త్వశాస్త్రమును బోధించుచుండిన పాఠశాలలో నేర్చుకొనినవి కావు. విశేషంగా, అది, ఈ అపొస్తలుడు మరియు తన పాఠకులు పాపులై యుండినప్పుడు సహితం, దేవుడు వారిని ప్రేమించుచుండుటను ఎన్నడును ఆపుజేయనందు వలన వారు విమోచింపబడినవారై యుండిరనే ఒక ప్రత్యక్షతయై యుండింది. క్రీస్తు సందేశమును గంభీరముగా పరిగణించడానికి కొరింథీయులు మొదలుపెట్టినప్పుడు, వారి మధ్య విభజనలు మరియు మానవాధికారము మరియు జ్ఞానమును గూర్చిన ఆకర్షణలు అప్రధానమైనవై అవి అడుగంటిపోతాయనేది అపొస్తలుని ఆధారాంశమై యుండింది.

**వచనము 25.** సువార్త సత్యము గూర్చి పౌలు, అది వెఱ్ఱితనముగాను బలహీనమైనదిగాను కనబడుచున్నదని అంగీకరించుటకైనను ఇష్టపడునంతటి ఆత్మవిశ్వాసంగలవాడై యుండెను. మానవ ప్రమాణములనుబట్టి, సిలువలో అతిశయించదగ్గ అంశమేదియు లేదు. సువార్త, వెఱ్ఱితనముగాక మరొకటి కాదని నశించుచున్నవారు తీర్పు తీర్చిననూ, **దేవుని వెఱ్ఱితనము మనుష్య జ్ఞానముకంటె జ్ఞానముగలదంటూ** అపొస్తలుడు సమాధానమిచ్చాడు. సువార్త, వెఱ్ఱితనముగాక మరొకటి కాదని మనుష్యులు తీర్పు తీర్చడమే, అది దేవుని వలన కలిగినదనే సాక్ష్యమై యున్నది. దేవుని నుండి వచ్చు ఏ సమాచారమైనను సరిగ్గా మానవుల ఆశలకు సరిపడునదై యుంటుందని ఏ ఒక్కరైనను ఆశించరు. దేవుని వెఱ్ఱితనము లేదా జ్ఞానముగూర్చి లోకము వేసే అంచనా కంటె ఈ సామాన్య విషయం ఎక్కువ ప్రాముఖ్యమై యున్నది: **దేవుని బలహీనత మనుష్యుల బలముకంటె బలమైనది**. మానవులు తమకిష్టము వచ్చినట్టుగా తర్కింపవచ్చు; అంతిమ విజయం ఆయనదే (దేవునిదే). ప్రభువు తిరిగి వస్తాడు. రక్షణ, సిలువలో మాత్రమే ఉన్నది, ఉండబోతున్నది.

## క్రీస్తునందు గల జ్ఞానము (1:26-30)

**[26]సహోదరులారా, మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి. మీలో లోకరీతిని జ్ఞానులైనను, ఘనులైనను, గొప్పవంశమువారైనను అనేకులు పిలువబడలేదు గాని [27-29]ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేని వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. [30]అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తుయేసునందున్నారు.**

**వచనము 26.** తాను ధ్రువీకరించిన విషయానికి మద్దత్తుగా, పౌలు కొరింథీ క్రైస్తవుల అనుభవము కొరకు విన్నవించుకొంటున్నాడు. క్రీస్తు విషయమైన బోధల గూర్చి లోకము అదివరకే తీర్పు తీర్చి అట్టి బోధను తృణీకరించినప్పటికిని, వారు తత్త్వశాస్త్ర సంబంధమైన మరియు మతపరమైన ఊహలను అవలంబించుట, మనుష్యుల యెదుట పరువు ప్రతిష్ఠలను వెదకుట, వారి విషయంలో అది ఎంతో విడ్డూరమైన విషయమై యుండింది. **జ్ఞానులైనను**, ఘనులైనను, గొప్పవంశపువారైనను వారిలో **అనేకులు** లేరు. క్రైస్తవ్యము యొక్క భవిష్యత్తు లోకంలో ఉన్నతవర్గమునకు చెందిన మేధావుల చేతుల్లో, పెట్టుబడిదారుల చేతుల్లో, లేదా సంపన్నుల చేతుల్లో లేకుండింది. "క్రీస్తు, అనగా సిలువవేయబడిన క్రీస్తు" (2:2), ప్రాథమికంగా వ్యవసాయదారులు మరియు సామాన్య శ్రామికుల హృదయాల్లో స్థిరనివాసమేర్పరచుకొను విశ్వాసమై యుండవలసి యుండింది.

క్రైస్తవ యుగములోని ఆది శతాబ్దములు మొదలుకొని, క్రైస్తవ్యమును హత్తుకొనినవారు చిన్నబిడ్డల వంటి బేలతనము మరియు సులభంగా మోసపోవువారై యున్నారని విమర్శకులు వర్ణించారు. క్రైస్తవుల శత్రు వొకడు, రెండవ శతాబ్దంలో రచనలు చేయుచుండినవాడు, వారు తమ తమ స్వస్థలాల నుండి "ఉన్ని కర్మాగారాల్లో పనిచేయువారుగా, చర్మకారులుగా, బట్టలుతికేవారుగా, మరియు అత్యంత నిరక్షరాస్యులైన వారుగాను ఇతర చోట్లకు వెళ్లినవారు మరియు పల్లెప్రాంతపు అమాయకులైన అజ్ఞానుల గుంపై యున్నారనియు," వీరు ఉపదేశకులు కాబోతున్నారని భావించాడనియు ఘోషించాడు.[10] అల్పమైన లేదా నీచమైన పనులు చేయుచుండినవారు, "జ్ఞానులు" అని లోకము ఎంచుచుండినవారు అనుకొన్నంత అజ్ఞానులు మరియు అమాయకులునై యుండిరని పౌలు అనుకొన్నప్పటికిని, లోకములోని జ్ఞానులు మరియు ఆడంబరపూర్వకమైనవారికి సిలువ సందేశము వినుటకు సమయము లేకుండినదని అతడు అంగీకరించుచున్నాడు. సిలువను గూర్చిన జ్ఞానము లోక జ్ఞానము యొక్క అవగాహనకు అందనంత అత్యంత గంభీరమైనదై యున్నది. గనుక అపొస్తలుడు, "మీ చుట్టూర ఒకసారి చూడండి," **మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి** అంటూ కొరింథీయులను సవాలు చేస్తున్నాడు.

కొరింథీ విశ్వాసులలో **లోకరీతిని** “జ్ఞానులైనవారు అనేకులు లేరని” పౌలు సాధికారపూర్వకంగా చెప్పుచున్న విషయం, కొరింథులోని ఆది క్రైస్తవుల సామాజిక మరియు ఆర్థిక స్థితిగతుల గూర్చిన ప్రశ్నలకు చోటిస్తున్నది. వాస్తవానికి, వారిలో కొందరైనా విద్వాంసులు మరియు ఐశ్వర్యవంతులు ఉండిరా? 1:20లో గల అలంకారయుక్తమైన ప్రశ్న, లౌకికంగా ఆడంబరపూర్వకమైనవారెవరైనను వారు క్రైస్తవులై యుండిరని తమ్ముకునుతాము ఎంచుకొనలేదనే అంతర్భావమును తెలుపుతున్నది. John Gager ఈ క్రింది విధంగా వ్రాస్తూ, సరైన విషయాన్నే తెలియజెప్పాడు:

> . . . కొందరు విశ్వాసులు విద్యనభ్యసించినవారై యుండిరి గనుక వారి స్థానిక నగరాల్లోను మరియు పట్టణాల్లోను సామాజిక ఆధిపత్య పరంపరలో సాపేక్షంగా ఉన్నతమైన స్థానాల్లో ఉండిరి. కాని మనము ఈ కొద్దిమంది గూర్చి కాదు గాని అధిక సంఖ్యాకుల గూర్చి ఆందోళన చెందుచు, తద్వారా మహోద్యమము యొక్క స్వభావమంతటి గూర్చి ఆందోళన చెందవలసి యున్నది.[11]

మొదటి శతాబ్దంలో, సువార్త ఎక్కువగా రోమా సామ్రాజ్యంలోని బీదలు మరియు తృణీకరింపబడినవారు క్రీస్తు యొక్క కృప మరియు క్షమాపణ గూర్చిన వార్త పట్ల కలిగియుండిన గ్రహణశీలత మూలాన లోకమంతా చొచ్చుకపోయింది. ఇదే పేదవారు మరియు నిరాకరింపబడినవారు, వారి వంతుకు, గృహాలు మరియు కర్మాగారాల్లోని పులిసిన పిండివలె పనిచేస్తూ ప్రభువుగా ప్రకటింపబడుచుండిన యేసు గూర్చి లోకమంతా వినేవరకు ముందుకు దూసుకొని వెళ్లుచుండిన దళమయ్యారు.

**వచనములు 27-29.** గనుక ఎక్కువగా కొరింథులోని సామాన్య ప్రజలు, అందరినీ ఆకట్టుకొననివారు, బీదలు, మరియు హేయంగా ఎంచబడినవారు తమ్ముకునుతాము రక్షింపబడినవారిలో లెక్కించుకొన్నారు. ఇది ఏదో ప్రమాదవశాత్తు జరిగిన విషయం కాదు; దేవుడే తన కార్యమును చేయుచుండెను. **జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు.** ఇంకా, **ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేని వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు** అని కూడ పౌలు సెలవిచ్చాడు (1:27-29). మానవుల అహంకారముతో కూడిన జ్ఞానమును మరియు శక్తిమంతమును దేవుడు ఉద్దేశపూర్వకంగానే భంపర్చాడు. అలా అయియున్న విషయాలను **వ్యర్థము చేయుట**కే దేవుడు ఈ ఏర్పాటుచేశాడు. దేవుడు లోకరీత్యా శక్తిమంతులైనవారిని అనిశ్చయతకు, దౌర్భాగ్య స్థితికి, భౌతిక మరణమునకు సహితం అప్పగిస్తూ, దీనులైనవారికి మంచి, అర్థవంతమైన, మరియు నిరీక్షణతో నింపబడిన జీవితములను అనుగ్రహించాడనే దాని కంటె ఏ విరుద్ధోక్తియైనను ఎక్కువ గంభీరమైనది కాదు. తన ప్రాణమును పోగొట్టుకొను విశ్వాసి, దానిని సంపాదించుకొనునని యేసయ్య సెలవిచ్చాడు (యోహాను 12:24, 25). లోకరీత్యా జ్ఞానులైనవారు ఈ సత్యమును ఎన్నడును అర్థంచేసుకొనరు. “సిలువ విషయంలో

బలహీనమైనదిగాను శక్తిహీనమైనదిగాను కనబడచున్న దానిని పౌలు వారి సొంత బలహీనత మరియు శక్తిహీనతకు పోలుస్తూ, వారి సామాజికపరమైన బలహీనతలో దేవుని శక్తి పనిచేయగలదని వారు చూడవలెనని తన చేసైగతో వారిని విన్నవించుకొంటున్నాడు."[12]

దేవుడు దేహమును ధరించాడనే విషయం, తన కుమారుడైన యేసు క్రీస్తులో శరీరధారి అయ్యాడనే విషయం విదితమైన క్రైస్తవ సిద్ధాంతమై యున్నది; అదొక ప్రాథమిక విశ్వాస సూత్రమై యున్నది. శరీరమును మరియు ఆత్మను సులభముగా వేరుచేయు దేనినైనను క్రైస్తవులు నిరాకరించారు. క్రొత్త నిబంధన కాలములలో, మంచితనము మరియు పరిశుద్ధత శరీరమగుచున్న విషయంలో విద్వాంసులైనవారు తొట్రిల్లారు. నేడు సహితం తొట్రిల్లుతున్నారు. "మీరు క్రైస్తవులగుటకు ఎందుకు నిరాకరిస్తున్నారు?" అని ఆగస్టీను Porphyry and Apuleius వంటి తత్త్వశాస్త్రవేత్తలను అడిగాడు. మరలా అతడు ఇదే ప్రశ్నకు మరొక ప్రశ్నతో సమాధానం కూడా వారికిచ్చాడు: "క్రీస్తేమో దీనుడై ఈ లోకానికి వచ్చాడు, మీరేమో అహంకారంతో ఆడంబరపూర్ణులై యుండుటనుబట్టియే కాదా?" ఇంకా, "నిజానికి, ప్లేటో స్థాపించిన పాఠశాలలో పాండిత్యము గడించినవారు క్రీస్తు శిష్యత్వములో చేరడమనేది పరువు తక్కువ పనే అవుతుందని" కూడ చెప్పాడు.[13] మానవుని పరిస్థితిలో స్వతఃస్సిద్ధంగానే మర్మము లున్నప్పటికిని, విద్వాంసులైనవారు యింకా తామే జ్ఞానవంతులని ఉజ్జాయింపుగా ఊహించుకొంటూ ఆలోచిస్తున్నారు.

**ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింప**నేరదు అనేది కొరింథీయులు నేర్చుకొనవలసిన పాఠమై యుండింది. సామాజికంగా ఉన్నత వర్గానికి చెందినవారైతేనేమి, సామాన్య ప్రజానీకమైనతేనేమి మానవ పాపమునకు, నిస్సహాయతకు, మరియు అజ్ఞానమునకు లోనగుటకు అవకాశములున్నవి, దేవుని రూపకల్పనలను తాను కనుగొన్నాడని ఏ ఒక్కరైనను స్వాధికారంతో చెప్పనేరరు; ఆయన మనస్సును ఎవరును గ్రహింపలేరు. రక్షకుని పంపడానికి దేవుడు పూనుకొనిన చొరవనుబట్టి కొరింథీయులు అతిశయించుటకు ఏ మూలాధారమైనను లేదు. తన అపొస్తలులు తన సందేశాన్ని లోకానికి ప్రచురము చేయవలెనని దేవుడు తానే వారిని పంపించాడు. ఈ క్రైస్తవులకు రక్షణ మానవుని ఏర్పాటు వలన కలుగలేదు. మహిమ దేవునికి మాత్రమే చెందవలసి యుండింది.

అతిశయము, అవమానమునకు వ్యతిరేకమైన పదమై యున్నది. ఈ రెండింటిలో ఏదియును ఆంతర్యములోని, మానసిక ప్రక్రియను సూచించడంలేదు; ఈ రెండును ఒకడు స్నేహితులు, బంధువులు, మరియు పొరుగువారి నుండి పొందు గౌరవము మరియు మర్యాదకు సంబంధించినవై యున్నవి. అవమానమంటే ఏమిటో, విందుల్లో అగ్ర స్థానములను ఆశించుచుండినవారికి తెలియజెప్పిన ఉపమానము ద్వారా యేసు సోదాహరణంగా చిత్రీకరించాడు. ఆతిథ్యమిచ్చువాడు వచ్చి, "మీరు కూర్చున్న కుర్చీలో నుండి లేచి, గౌరవనీయులైన వీరిని కూర్చోనివ్వండి" అని చెప్పవచ్చు. "అప్పుడు నీవు సిగ్గుపడి కడపటి చోటున కూర్చుండసాగుదువు" అంటూ యేసు తన వివరమును ముగించాడు (లూకా 14:9). అగ్ర స్థానమును ఎన్నుకొనడం ద్వారా, ఒకడు తోటి అతిథుల ప్రశంసలను మరియు పొగడ్తలను అతిశయోక్తితో ఆశించు చుండును; అయితే

కడపటి చోటుకు వెళ్లాల్సి వచ్చినప్పుడు అదే తోటి అతిథులు అతనిని అవమానపరచుదురు. "అవమానము" అని అర్థమిచ్చు గ్రీకు పదము, "తలవంపు" మరియు "అపకీర్తి" అని అర్థమిచ్చు ఆంగ్ల పదమునకు సమానమై యున్నది. అతిశయము మరియు అవమానమునకు సంబంధించిన సామాజిక పరిమాణముల గూర్చి పౌలు ఆలోచించుచుండెను. సిలువను గూర్చి బోధించుట కొరింథీ క్రైస్తవుల విషయంలో, అది ప్రజలు ప్రశంసించుచుండిన పరిస్థితిగా పరిణమించలేదు. క్రీస్తునందు "ఏ శరీరియు అతిశయించనేరడు." క్రీస్తు నొద్దకు వచ్చుట అనగా, పాపమును మరియు నిస్సహాయ స్థితిని ఒప్పుకొనుటయే.

**వచనము 30.** పౌలు మరియు అతని పాఠకులు **క్రీస్తు యేసునందున్నారు**, కాని ఇట్టి నిశ్చయతలో అతిశయించడానికి అవకాశమే లేదు. వారు ఆయన చేసిన కార్యమును బట్టి "క్రీస్తు యేసునందుండిరి." దేవుడే ఈ కార్యమునకు పూనుకొని వారిని రక్షించాడు. నొక్కివక్కాణింప బడుతున్న **మీరు** (ὑμεῖς, *humeis*) కొరింథీయులను ఈ లోకరీత్యా జ్ఞానులైనవారితో తీవ్రంగా పోల్చుతున్నది. "క్రీస్తు యేసునందుండుట" అనగా, వారు ఏమైయుండిరో, అట్టి సమస్తము వారు మృత్యుంజయుడై తిరిగి లేచిన ప్రభువుతో కలిగియుండిన సంబంధమునుబట్టి నిర్వచింపబడింది: వారి జీవితములు, వారి ఉనికి, వారి సమాజము, నిరీక్షణ, మరియు భవిష్యత్తు ఆయనలో ఉండినవి. వారి విమోచనము మరియు నిరీక్షణకు ఆధారము (ground) ఆయనే, మూలాధారము (source) ఆయనే. కాబట్టి, క్రీస్తు, **దేవుని మూలముగా మనకు జ్ఞానమై** యున్నాడు. పౌలుకైతే, క్రీస్తునందుండుట అనగా సమగ్రమైన మార్పైయుండింది. సమస్త కర్తవ్యపాలనము, జ్ఞానము, మరియు ఆదరము ఆయనయందే కేంద్రీకృతమై యున్నవి.

ఎన్ఏఎస్బి (న్యూ అమెరికన్ స్టాండర్డ్ బైబిల్) "దేవుని మూలమైన జ్ఞానమును," **నీతి మరియు పరిశుద్ధపరచబడుట, మరియు విమోచనము**నకు సమానాంతర వ్యక్తీకరణముగా నివేదించుచున్నది. ఎన్ఆర్ఎస్వి (NRSV) కూడ ఇలాగే నివేదించు చున్నది, కాని NIV వాక్యములోని విరామ చిహ్నాలను వేరువిధంగా గుర్తుపెట్టుచున్నది. NIV అనువాదకులు, "దేవుని మూలమైన జ్ఞానమును" ఇతర భావములన్నిటిని చుట్టుముట్టుచున్న విషయంగా అర్థంచేసుకొన్నారు. కాబట్టి, వారు ఇదే వచనాన్ని, "మన కొరకు దేవుని మూలముగా జ్ఞానమైనవాడు - అనగా, మన నీతి, పరిశుద్ధత మరియు విమోచనయైనవాడు" అని అనువదించారు. లోక రీతియైన జ్ఞానము మరియు క్రీస్తు మూలమైన జ్ఞానమునకు మధ్య పౌలు రాబట్టిన తీవ్రమైన తారతమ్యము, ఎన్ఐవి అనువాదం సరైన అవగాహనను తెలియజెప్పుతున్నదని సూచించుచున్నది.

## సారాంశం (1:31)

**[31]-అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెనని వ్రాయబడినది నెరవేరునట్లు దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను.**

**వచనము 31.** కొరింథు క్రైస్తవులు మానవ స్వావలంబనమును ప్రక్కకు నెట్టిపేయవలసిందని విన్నవించుకొనడం ద్వారా అపొస్తలుడు తత్త్వశాస్త్రసంబంధమైన జ్ఞానమును మరియు లోక రీతియైన పాండిత్యమును క్రోడీకరిస్తూ దాని గూర్చిన తన తృణీకారమును నొక్కివక్కాణించాడు. అతడు కూశశ లో నుండి యిర్మీయా 9:23ను ఉల్లేఖించాడు, కాని అనుకూలించుకొనబడిన తీరు ప్రవక్త యొక్క విన్నపమునకు ఎటువంటి హాని కలిగించలేదు. మానవ జ్ఞానము, బలము, మరియు పరువు అతిశయించుటకు అవసరమగు ఎవ్విధమైన హేతువునైనను సమకూర్చడం లేదు. క్రైస్తవుని అతిశయం సిలువ వేయబడిన రక్షకునిలో ఉన్నది. **అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెనని** పౌలు ఉల్లేఖించాడు (యిర్మీయా 9:23, 24 చూడుము). నజరేతువాడైన యేసునందు అతిశయించుట సర్వోచ్ఛమైన వక్రోక్తియై యున్నది: ఆయన వంశవృక్షము లేదా అదృష్టములేని ఊరూర తిరుగుచు బోధించుచుండిన బోధకుడై యుండెను. యేసు లోకరీతియైన పేరుప్రతిష్ఠలను, అధికారమును, మరియు జ్ఞానమును నిరాకరించాడు; అలాగైతే, ఆయన వలె ఉండగోరు సంఘం సహితం ఇదే పని చేయాలి.

## అన్వయము

### ప్రేరేపణ మరియు జ్ఞాపకశక్తి (1:14-16)

"ప్రతి లేఖనము దైవావేశము వలన కలిగినది" అని పౌలు తిమోతికి తెలియజెప్పాడు (2 తిమోతి 3:16. 17). పౌలు తన సొంత ప్రేరేపణ గూర్చిన అవగాహన కలిగియుండెను (1 కొరింథీ. 2:13). బైబిలు ప్రేరేపింపబడిన గ్రంథం, గనుక క్రైస్తవులు తమ నైతిక ప్రవర్తన మరియు సిద్ధాంతమునకు అవసరమగు మార్గనిర్దేశనము నిమిత్తము దానిలోని మాటలను మనస్సులో ఉంచుకొనుచుందురు. ప్రేరేపణ మరియు ప్రామాణిక గ్రంథం గూర్చిన ప్రశ్నలు లేఖనానుసారమైన అధికారముతో సంబంధంగలవై యున్నవి. ఏదేమైనప్పటికిని, పౌలుగాని లేదా బైబిలు గ్రంథకర్తలలోని ఇతరులైవరైనాగాని, ప్రేరేపింపబడిన వారి దస్తావేజులను సిద్ధంచేయునట్లు పరస్పర ప్రభావ చర్యల ద్వారా పరిశుద్ధాత్మ రచయితల మనస్సులను ప్రభావితం చేసిన మర్మసహితమైన ప్రక్రియను వివరించలేదు. లేఖనానుసారమైన అధికారం ప్రాముఖ్యం గనుక ప్రేరేపణ యొక్క స్వభావం సహితం ప్రాముఖ్యమే.

అతడు క్రిస్పునకు మరియు గాయియునకు బాప్తిస్మమిచ్చాడని అపొస్తలుడు 1:14, 15లో పేర్కొని, 1:16లో తన మతిమరుపుకు తావిస్తూ, స్తెఫను (Stephanas) ఇంటివారికి కూడ బాప్తిస్మమిచ్చాడని చెప్పడానికి అటుతరువాత తనను తాను సరిదిద్దుకొన్నాడు. పరిశుద్ధాత్మ కేవలము అతని మనస్సును మాత్రమే ఆయన అధీనంలోనికి తీసుకోలేదని ఈ విషయం స్పష్టంచేస్తున్నది; పరిశుద్ధాత్మ మర్చిపోతుంటాడని ఎవరును తర్కించనేరరు. పరిశుద్ధాత్మ, పౌలును అతని సొంత జ్ఞాపకశక్తి పరిధుల లోపలే, సంఘము యొక్క నిర్దిష్టమైన అవసరములను అనుసరిస్తూ, అతడు జీవించుచుండిన

లోకంలోని సామాజిక మరియు సాంస్కృతిక వ్యవస్థ ప్రకారం ప్రేరేపించుచుండినాడు. ఈనాటి పాఠకులు సిద్ధాంతము మరియు ప్రవర్తనకు సంబంధించి కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికలో నుండి అధికారమును మరియు మార్గనిర్దేశనమును రాబట్టుకొను విధానం విషయంలో ఇదంతా ప్రాముఖ్యమైన అంతర్భావాలు కలిగియున్నది.

"కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రిక" అని మనము పిలుచుకొనుచున్న లిఖితపూర్వకమైన ఈ దస్తావేజును తయారు చేయడంలో, వ్యాకరణ రీత్యా పౌలు "ఉత్తమ పురుషయై" యుండెను. కొరింథులోని అపొస్తలుని సమకాలీనులు అనగా ఈ పత్రిక యొక్క ప్రత్యక్ష గ్రహీతలు, "మధ్యమ పురుషయై" యుండిరి, పరంపరానుగతమైన పాఠకులు "ప్రథమ పురుష"యై యున్నారు, వీరు ఈ పత్రికను రచించినవారు కాదు, సరికదా, ఉత్తరప్రత్యుత్తరముల రీత్యా సూటిగా వారికే పంపబడినప్పుడు పొందినవారు కూడ కాదు. "ప్రథమ పురుష"గా పాఠకులమైన మనము కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రిక నుండి అధికారపూర్వకమైన నిర్దేశనమును పొందడానికి, తొలి పాఠకులు అర్థంచేసుకొనిన విధంగా మనకు కూడ అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. ఆ తరువాత, తొలి పాఠకుల ప్రపంచం మరియు మన వర్తమానకాల ప్రపంచం కలిపి ఉమ్మడిగా కలిగియుంటున్న విషయాలేమిటో, తేడాలేమిటో మనము నిర్ధారించుకోవాలి. మనము లేఖనములలో అధికారపూర్వకమైన నిర్దేశనము కొరకు అన్వేషించునప్పుడు, పౌలు సంబోధించిన వాటి వలెనే తరతమ తేడాలున్న ఆందోళనకరమైన విషయాలను ఈనాటి సంఘం ఎదుర్కొను చున్నదని మనము అంగీకరించాల్సి వుంటుంది. ఉదా|| సంఘ సమైక్యత గూర్చిన సమస్యలు (1:10; 11:18) మరియు దుర్నీతితోకూడిన ప్రవర్తన (6:9-11) ఒకే విధంగా ఉన్నాయి, అయితే స్త్రీలు తమ తలపై ముసుగు వేసుకొనుట గూర్చిన విధానం (11:5-16) చెప్పుకోదగినంత భిన్నంగా ఉన్నది.

## బలహీనులు మరియు వెర్రితనముగలవారు (1:25)

యేసు మరియు ఆయన శిష్యులైన పేతురు, యాకోబు మరియు యోహాను గెత్సేమనే తోటలో ఉండినప్పుడు పేతురు యేసు శత్రువులకు విరోధంగా కత్తిని దూసిన సందర్భంలో, దేవుని రాజ్యమును ముందుకు తీసికొని వెళ్లడానికి సాయపడు సాధనంగా దౌర్జన్యము ప్రయోగింపబడుటను యేసు తృణీకరించాడు. "ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహముల కంటె ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొనుచున్నావా?" అని ఆయన సెలవిచ్చాడు (మత్తయి 26:53; యోహాను 18:10, 11 చూడుము). ఆయన తన పరిచర్యను ఆరంభించినప్పటి నుండి, దేవుని రాజ్య సంబంధమైన పోరాటము రణరంగములోగాక వేరొక రంగంలో పోరాడబడవలసి యుంటుందనే విషయాన్ని యేసు సుస్పష్టంగా బోధించాడు.

ఖడ్గాలు చేబూనిన సైన్యములను ప్రయోగించు విధానమును ఆయన అనివార్యంగా అనుసరించుచుండవలెనని యేసును ఒప్పించడానికి అపవాది సకల ప్రయత్నాలు

చేశాడు. వాడు యేసును మిగుల ఎత్తైన ఒక కొండ శిఖరమునకు తీసుకొని వెళ్లి, ఈ లోక రాజ్యము లన్నిటిని ఆయనకు చూపించి, ప్రాథమికంగా, "ఇవన్నీ నేను నీకియ్యగలను. నీవు సిలువ మీద శ్రమపడాల్సిన అవసరమే లేదు" అనే భావంతో కూడిన మాటలు పలికాడు (మత్తయి 4:8, 9). జెలోతేయులు ఆయనను రాజుగా చేయాలని ప్రయత్నించినప్పుడు, ఆయన అచ్చోట నుండి సాధ్యమైనంత త్వరగా తప్పించుకొని వెళ్లిపోయాడు (యోహాను 6:15). రక్షకుడు సేనా సంబంధమైన అధికారబలమునుగాని సరికదా, ఆర్థిక సంబంధమైన అధికారమునుగాని ప్రయోగించలేదు. ఐహిక సాఫల్యమును ఆశించనే కూడదని భవిష్యత్తులో ఆయనను వెంబడించుటకు సూచనలుండిన ఒకనిని యేసు హెచ్చరించాడు (మత్తయి 8:20). ఆయనను వెంబడించిన స్త్రీల ఉపచారము లేకుండా, ఆయన దీన దశ అంత కంటె తీవ్రమైనదై యుండేది (లూకా 8:2, 3).

లౌకికమైన ప్రజలు అధికారమును అంచనా వేసిన విధానములను యేసు తృణీకరించాడు, కాని అయన అధికారము లేనివాడై యుండలేదు. ఆత్మసంబంధమైన సత్యములను ఉపదేశించడానికి ఆయన రణరంగమునకు సంబంధించిన ఉపమాలంకారములను ఉపయోగించాడు (లూకా 14:31, 32 చూడండి). సత్యము, ప్రోద్బలము, కనికరము, విశ్వాసము, మరియు ప్రేమ మున్నగునవి, ఆయన తన శిష్యుల చేతుల్లో ఉంచిన యుద్ధోపకరణములై యుండినవి. క్రైస్తవ పోరాటంలో ఉపయోగింపబడాల్సిన యుద్ధోపకరణములు సుప్రసిద్ధులైన సైన్యాధికారులు తమ సైన్యములకు సరఫరా చేయునటువంటివి కావు, కాని అయినప్పటికిని అవి దుర్జేయమైనవే (ఎఫెసీ. 6:13-16; 1 థెస్స. 5:8). క్రీస్తు ప్రజలు, వారి ప్రభువును పోలియుండుట ద్వారా, లోకము, వెఱ్ఱితనమని పరిగణించు దానిలో జ్ఞానమున్నదని కనుగొంటారు. లోకము, బలహీనమైనదని భావించు దానిలో బలమున్నదని తెలుసుకొంటారు.

---

సూచనలు

[1] పౌలు మరియు కొరింథీ సంఘమునకు మధ్య తలెత్తిన సంఘర్షణ, పౌలు వారికి తన ఉత్తరమును వ్రాయడానికి మూల కారణమై యుండిందని Gordon D. Fee సమర్థించాడు. తదనుగుణంగా, అతని అపొస్తలత్వమును ధ్రువీకరించడము ద్వారా పౌలు తన అధికారమును నొక్కివక్కాణించాడని అతడు తర్కించాడు. (Gordon D. Fee, *The First Epistle to the Corinthians*, The New International Commentary on the New Testament [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987], 28–30.) పౌలు మరియు కొరింథులోని కొందరికి మధ్య ఉద్వేగం ఉండిందనేది స్పష్టమవుతున్నప్పటికిని, ఈ ఉద్రిక్తత తన ఉత్తరమంతటిలోను పేర్కొనబడిన ముఖ్య ఆందోళనయై యుండినట్టు కనబడదు. [2]The LXX, or Septuagint, గ్రీకు భాషలోనికి అనువాదము చేయబడిన లేఖనములై యున్నది. [3]Victor Paul Furnish, *Theology and Ethics in Paul* (Nashville: Abingdon Press, 1968), 155. [4]గలతీయులకు వ్రాయబడిన పత్రిక మరియు కొరింథీయులకు వ్రాయబడిన మొదటి పత్రికకు వెలుపల, యోహాను 1:42లో మాత్రమే పేతురు "కేఫా" అని పిలువబడుతున్నాడు. పేతురును

పౌలు అప్పుడప్పుడు "పేతురు" అని సంబోధించినప్పటికిని, "కేఫా" అనే పేరు పేతురు విషయంలో పౌలు ఎక్కువగా ఇష్టపడిన పేరై యున్నది. [5]Gerd Theissen, *The Social Setting of Pauline Christianity: Essays on Corinth*, ed. and trans. John H. Schütz (Philadelphia: Fortress Press, 1982), 55. [6]I. Howard Marshall, *New Testament Theology: Many Witnesses, One Gospel* (Downers Grove, Ill.: InterVarsity Press, 2004), 268. [7]చివరి మాట మీనహాయిస్తే పౌలు ఉదహరించి చేప్పిన లేఖనము యెషయా 29:14లోనుండి తీసుకొనబడింది. నేను జ్ఞానుల జ్ఞానమును ప్రక్కకు పెట్టుదును లేక రద్దు చేయుదును - ἀθετήσω, *athetēsō* అను దేవుని మాటలకు బదులుగా, నేను . . . దాచెదను κρύψω, *krupsō* అని LXX చెప్పుచున్నది. [8]Leon Morris, *The First Epistle of Paul to the Corinthians*, rev. ed., The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 46. [9]Brevard S. Childs*, Biblical Theology of the Old and New Testaments: Theological Reflection on the Christian Bible* (Minneapolis: Fortress Press, 1992), 512. [10]Origen *Against Celsus* 3.55.

[11]John Gager, "Shall We Marry Our Enemies?: Sociology and the New Testament," *Interpretation* 36 (July 1, 1982): 262. [12]Troels Engberg-Pedersen, "The Gospel and Social Practice according to 1 Corinthians," *New Testament Studies* 33 (October 1987): 562. [13]Augustine *City of God* 10.29.